


# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు





గిరిజనులకు అన్నివిధాల

## అండగా ఉంటాం

- మంత్రి లోకేష్ ఆదివాసీ దినోత్సవ శుభాకాంక్షలు 6



## ఆదివాసీ సోదరి అభిమానం

రాఖీ పండుగ రోజు కొండమ్మ ఇంటికి దేవుడు పంపిన అతిథిలా సీఎం చంద్రబాబు వెళ్లారు. అరుదైన అనురాగ బంధం, ఆత్మీయ రక్షాబంధనానికి వంజంగి గ్రామంలో ఆదివాసీ ఈశ్వరయ్య ఇల్లు వేదికైంది. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం కార్యక్రమంలో పాల్గొనేందుకు అల్లూరిజిల్లా పాడేరు మండలం వంజంగి వెళ్లిన ముఖ్యమంత్రి.. ఈశ్వరయ్య ఇంటికి వెళ్లారు. రాఖీ పండగ రోజు మహిళలను మహాశక్తిగా తీర్చి దిద్దిన పెద్దన్న చంద్రన్న తమ ఇంటికి రావడంతో ఈశ్వరయ్య భార్య కొండమ్మ ఆనందానికి అవధులు లేవు. చంద్రన్నకు తీపి తినిపించి, రాఖీ కట్టింది. చంద్రన్న ఆశీర్వాదం అందుకుంది.

# ఆదివాసీల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి



- అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారు
- ఆదివాసీలంటే గుర్తొచ్చేది సహజ నైపుణ్యం, సామర్థ్యం
- అదనంగా లక్ష ఎకరాల్లో కాఫీ ప్లాంటేషన్
- టూరిజం క్లస్టర్లుగా అరకు, లంబసింగి, మారేడుమిల్లి
- గ్రామీణ ఆవాస్ యోజన కింద ఆదివాసీలకు 54 వేల ఇళ్లు నిర్మిస్తాం
- రూ.482 కోట్లతో 5 మల్టీస్పెషాలిటీ ఆస్పత్రులు
- రద్దయిన జీవో నంబర్ 3 స్థానంలో ప్రత్యామ్నాయ మార్గాల్లో గిరిజనులకు మేలు
- ఏజెన్సీ అంటే దేవుడు సృష్టించిన అద్భుతం
- మళ్లీ జన్మ ఉంటే ఇక్కడ పుట్టాలని ఉంది
- అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

2

## అడవితల్లి ఒడిలో.. ఆదివాసీల మధ్య

- అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని వనదేవత మోదకొండమ్మను ప్రార్థించా
- తోటల మధ్య అద్భుతమైన అరకు కాఫీ రుచి చూశా
- ఎక్స్‌లో సీఎం చంద్రబాబు

అమరావతి(చైతన్యరథం): అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల మధ్య గడపటం ఎంతో సంతోషాన్నిచ్చిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్‌చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా అల్లూరి సీతా రామరాజుజిల్లాలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశాను. అంతకుముందు పాడేరు మండలం వంజంగి లో వనదేవత మోదకొండమ్మనుదర్శించుకుని రాష్ట్రం సుభిక్షంగా ఉండేలా చూడమని కోరుకున్నాను. గ్రామంలోని గిరిజన సోదరులు సాగుచేసే కాఫీ తోటకు వెళ్లి వారితో మాట్లాడి సాగు విధానం, ఆదాయం గురించి తెలుసుకున్నాను. కాఫీ రైతులతో కలిసి తోటల మధ్య అద్భుతమైన అరకు కాఫీ రుచి చూశాను. అనంతరం ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొని రానున్న రోజుల్లో ఏజెన్సీలో చేపట్టే కార్యక్రమాలను ప్రజలకు వివరించానని సీఎం చంద్రబాబు తన పోస్ట్‌లో తెలిపారు.



## అరకు కాఫీకి బ్రాండింగ్

- టాటా సంస్థతో జీసీసీ ఎంఓయూ
- ఐటీడీఏలతో రబ్బర్, కాఫీ బోర్డుల ఒప్పందాలు
- పర్యాటకంలో హోమ్ స్టేల అభివృద్ధికి ముందుకొచ్చిన ఓయో
- ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో గిరిజనుల అభివృద్ధికి వివిధ సంస్థలతో 21 ఒప్పందాలు

3



## మంగళగిరి ఆడపడుచులు నా అక్కాచెల్లెళ్లు!

- వారికి ఎల్లప్పుడూ రుణపడిఉంటా
- మీ ఆశీస్సులతో నియోజకవర్గాన్ని నెం.1గా తీర్చిదిద్దుతా
- మంత్రి నారా లోకేష్ ఉద్ఘాటన
- మంత్రికి రాఖీలు కట్టిన మంగళగిరి మహిళలు

6



రాఖీ పండుగ రోజు ఆడబిడ్డలకు పట్టాల పంపిణీ..

## ఎంతో సంతృప్తి ఇచ్చింది

- 2029 నాటికి ప్రతి ఒక్కరికీ సొంతింటి కలను నిజం చేస్తాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టీకరణ
- నెల్లూరు భగత్ సింగ్ కాలనీలో 633 మందికి పట్టాల పంపిణీలో వర్చ్యువల్‌గా పాల్గొన్న సీఎం

4

# సత్వర న్యాయంలో నెంబర్ 1గా ఏపీ

- అదే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్ర ప్రజలకు భరోసా ఇస్తూ ఎక్స్‌లో సీఎం చంద్రబాబు పోస్ట్
- సత్వర న్యాయం, పోలీసింగ్ సహా వివిధ అంశాల్లో దేశంలోనే రెండో స్థానంలో ఏపీ
- ఇండియా జస్టిస్ రిపోర్ట్-2025లో రాష్ట్రాల పనితీరుపై నివేదిక

అమరావతి(చైతన్యరథం): ప్రజలకు సత్వర న్యాయం అందించటంలో ఏపీని నెంబర్ 1 రాష్ట్రం గా తీర్చిదిద్దటమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ప్రజలకు న్యాయసహాయం, పోలీసింగ్ సహా వివిధ కేటగిరీల్లో ఏపీ దేశంలోనే రెండో స్థానంలో నిలవటంపై వచ్చిన కథనాలపై స్పందించిన సీఎం రాష్ట్ర ప్రజలకు భరోసా ఇస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ అంశాల్లో దేశంలో రెండో స్థానంలో నిలిచిన ఏపీ కీలకమైన మైలు రాయిని అందుకున్నా సంతృప్తి చెందటం లేదని.. ఏపీని అగ్రస్థానంలో నిలబెట్టేంత వరకూ నిర్విరామంగా పనిచేస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

సత్వర న్యాయం, పటిష్టమైన పోలీసింగ్ సహా వివిధ అంశాల్లో దేశంలోనే ఏపీ రెండో స్థానంలో నిలిచింది. ప్రజలకు న్యాయ సహాయం అందించ టంలో, శాంతిభద్రతల్లో ఏపీ టాప్‌లో ఉందని ఇండియా జస్టిస్ రిపోర్టు -2025 వెల్లడించింది. రాష్ట్రంలో ప్రజలకు సత్వర న్యాయం అందటం, శాంతిభద్రతలు, పోలీసింగ్, న్యాయవ్యవస్థ పనితీరు, సామాజిక, చట్టపరమైన పాలన, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఇండియా జస్టిస్ సంస్థ ఏపీకి ర్యాంకింగ్ ఇచ్చింది. ఈ నివేదిక ఆధారంగా వివిధ పత్రికలు, వెబ్‌సైట్లు కథనాలు వెలువరించాయి. జగన్ హయాంలో రాజకీయ ప్రతీకారాలు, ప్రతిపక్ష నాయకుల్ని టార్గెట్ చేసేందుకు పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేయటంతో ఏపీ ర్యాంకింగ్ దిగజారిపోయింది. 2019 నుంచి 2024 వరకు ఆంధ్రప్రదేశ్ ర్యాంకింగ్ బాగా పడిపోయింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో చట్టబద్దపాలన తిరిగి వచ్చినట్టు ఇండియా జస్టిస్ రిపోర్టు పేర్కొంది. పోలీసింగ్‌తో పాటు న్యాయ సహకారాన్ని అందించటంలో ఏపీ పనితీరు మెరుగైనట్లు ఆ నివేదిక వెల్లడించింది. ఇండియా జస్టిస్ రిపోర్టులో 6.78 స్కోర్‌తో కర్ణాటక రాష్ట్రం మొదటి స్థానంలో ఉంది. 6.32 స్కోర్‌తో



దేశంలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలిచింది. ఇక ఆ తదుపరి స్థానాల్లో తెలంగాణ, కేరళ, తమిళ నాడు రాష్ట్రాలు ఉన్నాయి.రాష్ట్రంలో శాంతిభద్రతల నిర్వహణను కూటమి ప్రభుత్వం కఠినంగా అమలు చేస్తుండటంతో ఏపీ మెరుగైన ర్యాంకింగ్ సాధించిందని మాధ్యమాల్లో కథనాలు వెలువడ్డాయి.

చైతన్యరథం

# ఆదివాసీల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి

- అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారు
- ఆదివాసీలంటేనే గుర్తొచ్చేది సహజ నైపుణ్యం, సామర్థ్యం
- అదనంగా లక్ష ఎకరాల్లో కాఫీ ప్లాంటేషన్
- టూరిజం క్లస్టర్లుగా అరకు, లంబసింగి, మారేడుమిల్లి
- గ్రామీణ ఆవాస్ యోజన కింద ఆదివాసీలకు 54 వేల ఇళ్లు నిర్మిస్తాం
- రూ.482 కోట్లతో 5 మల్టీస్పెషాలిటీ ఆస్పత్రులు
- రద్దయిన జీవో నంబర్ 3 స్థానంలో ప్రత్యామ్నాయ మార్గాల్లో గిరిజనులకు మేలు
- ఏజెన్సీ అంటే దేవుడు సృష్టించిన అద్భుతం
- మళ్లీ జన్మ ఉంటే ఇక్కడ పుట్టాలని ఉంది
- అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు



పాడేరు (చైతన్యరథం): ఆదివాసీలు అన్ని విధాలా అభివృద్ధి చెందితేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని, గిరి పుత్రుల్లో మరింత చైతన్యం తీసుకురాగలిగితే అభివృద్ధికి ఢోకా ఉండదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఎన్టీఆర్ శ్రీకారం చుట్టగా దాన్ని తాను కొనసాగిస్తున్నానన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానిక గిరిజనులకే ఉద్యోగాలు కల్పించేందుకు గతంలో తాము జీవో నెంబర్ 3 తీసుకొస్తే గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ఆ జీవోలు రద్దయ్యాయని, రద్దయిన జీవో నంబర్ 3 స్థానంలో ప్రత్యామ్నాయ మార్గాల్లో గిరిజనులకు మేలు చేస్తామన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం వంజంగిలో శనివారం నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. వంజంగిలో వనదేవత మోదకొండమ్మ ఆలయాన్ని ముఖ్యమంత్రి దర్శించుకున్నారు. అనంతరం గ్రామ సమీపంలో కాఫీ తోటలను పరిశీలించి, గిరిజన సంప్రదాయ వేడుకలను తిలకించారు. ఆదివాసీ ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. టూరిజం అభివృద్ధిపై తీసుకుంటున్న చర్యలు, ప్రాజెక్టుల వివరాలను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

### గిరిపుత్రుల మధ్య ఉండటం సంతోషాన్నిస్తోంది

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ ఈ రోజుకు రెండు ప్రత్యేకతలు ఉన్నాయన్నారు. అంతర్జాతీయ గిరిజన దినోత్సవం-అన్నా చెల్లెళ్ల అనుబంధం చాటే రాఖీ పండుగ కలిసి వచ్చాయి. ఇలాంటి పవిత్రమైన రోజున పాడేరులో ఇలా గిరిపుత్రులు మధ్యలో ఉండటం నాకు సంతోషాన్నిస్తోంది. పేదలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించాలనే లక్ష్యంతో కష్టపడుతున్నాను. గతంలో పాడేరు రావాలనుకున్నా వాతావరణం అనుకూలించక రాలేకపోయాను. ఏజెన్సీ అంటే దేవుడు సృష్టించిన అద్భుతం. ఇక్కడికి వస్తున్న సమయంలో కొండలు, పచ్చటి వాతావరణం చూశాను. మళ్లీ జన్మ ఉంటే ఇక్కడ పుట్టాలని ఉంది. విత్తన పండుగలు, సంక్రాంతి వరకూ ఎంతో పవిత్రంగా జరుపుకుంటారు. గత పాలకులు ఈ ప్రాంతాన్ని పట్టించుకోకపోవడంతో అనేక ఇబ్బందులు వచ్చాయి. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు... దాన్ని నేను కొనసాగిస్తున్నానన్నారు.

### ఉచితంగా సోలార్ రూఫ్‌టాప్

గిరిజనుల సంక్షేమంతో పాటు ఆ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. గతంలో ఐఏఎస్ అధికారులను ప్రాజెక్ట్ ఆఫీసర్లుగా నియమించి ఐటీడీఏలను బలోపేతం చేశాం. రాష్ట్రంలో ఎస్టీలు 28.32 లక్షలు కాగా అందులో సుమారు 8.41 లక్షలు గిరిజన కుటుంబాలు ఉన్నాయి. 3,77,051 మంది గిరిజనులకు ప్రతినెలా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఇస్తున్నాం. పక్క రాష్ట్రాలు చత్తీస్‌గఢ్, ఒడిశాలో ఎంత పెన్షన్ ఇస్తున్నారో ఒకసారి గమనించండి. గిరిజనులకు పింఛన్ల కోసమే ఏడాదికి రూ.1,595 కోట్లు ఖర్చు చేస్తున్నాం... ఇదీ గిరిజనుల సంక్షేమంపై మా చిత్తశుద్ధి. 4.82 లక్షల గిరిజనుల గృహాలకు నెలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తున్నాం. త్వరలోనే సోలార్ రూఫ్ టాప్ ఉచితంగా ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుడతామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు.

### మట్టిలో మాణిక్యాలు గిరి పుత్రులు

మన గిరిజన బిడ్డలు మట్టిలో మాణిక్యాలు. అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని నమ్మాను. తల్లికి వందనం పథకం ద్వారా 1 నుండి 12వ తరగతి వరకు చదువుతున్న 4,86,803 మంది గిరిజన విద్యార్థులకు రూ.642 కోట్లు తల్లుల ఖాతాలో వేశాం. ఏజెన్సీ పరిధిలోని స్కూళ్లు, కాలేజీల్లో చదువుతున్న 1,76,796 మంది గిరిజన విద్యార్థుల కోసం ఏడాదికి రూ.1,337 కోట్లు ఖర్చు చేస్తున్నాం. గిరిజన యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్, హస్తకళల తయారీ, ఈ-కామర్స్ విక్రయాలపై శిక్షణ ఇస్తున్నాం. తాజాగా శుక్రవారమే విద్యాశాఖ మంత్రి 373 నూతన భవనాల నిర్మాణానికి రూ.45 కోట్లు విడుదల చేశారని సీఎం చంద్రబాబు వివరించారు.

### గిరిజన ప్రాంతాల్లో మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రులు

ఆదివాసీల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంటోంది. గిరిజన గ్రామాల్లో వైద్యానికి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాం. 1,487 మంది సికిల్ సెల్ రోగులకు నెలకు రూ.10,000 పింఛన్ ఇస్తున్నాం. గర్భిణులకు పోషకాహార ప్యాకేజీలు, రవాణా సదుపాయం అందిస్తున్నాం. డోలీ మోతలు లేకుండా 76 బర్త్ వెయిటింగ్ హాల్స్ బలోపేతం చేశాం. 35 కొత్త భవనాలు నిర్మాణంలో ఉండగా 15 భవనాలకు మరమ్మతులు చేస్తున్నాం. 122 ఫీడర్ అంబులెన్సులు ఏర్పాటు చేశాం. రూ.482 కోట్లతో గిరిజన ప్రాంతాల్లో 5 మల్టీస్పెషాలిటీ హాస్పిటళ్లు ఏర్పాటు చేస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు.

### అరకు కాఫీ అంటే ఒక బ్రాండ్

అరకు కాఫీ ప్రపంచవ్యాప్తం కావాలి. అరకు కాఫీ నేను ప్రమోట్ చేసిన బ్రాండ్. ప్యారిస్‌లో కూడా అరకు కాఫీ స్టాల్ ఏర్పాటు చేశాం. పాడేరు ఏజెన్సీలోని 11 మండలాల్లో 2.58 లక్షల ఎకరాల్లో కాఫీ సాగవుతోంది. దీనిపై 2.46 లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారు. మరో లక్ష ఎకరాల్లో కొత్తగా కాఫీ తోటలు పెంచాలని ప్రయత్నిస్తున్నాం. అలాగే ఏజెన్సీలో 1.80 లక్షల ఎకరాల్లో చెర్రీ సాగు చేసి 90,000 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సాధిస్తున్నారు. మన గిరిజన రైతన్నలు మామిడి, సపోటా, జీడిపప్పు, పనస, నేరేడు, నిమ్మ, సీతాఫలమే కాదు కుంకుమవంటి పంటలు కూడా సాగుచేసి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఒకప్పుడు ఏజెన్సీ అంటే గంజాయి ప్రాంతమని చెడుగా భావించేవారు. గత ప్రభుత్వం స్వచ్ఛమైన ఏజెన్సీలను కలుషితం చేసింది. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక ఏజెన్సీలోనే కాదు రాష్ట్రంలో ఎక్కడా గంజాయి మాట వినపడటంలేదని సీఎం చంద్రబాబు తెలిపారు.

### రోడ్ల నిర్మాణంతో గిరిజనుల ఇక్కట్లు తీరుస్తాం

ఏజెన్సీ ప్రాంతంలో రోడ్లు నిర్మించి గిరిజనుల ఇక్కట్లు తీరుస్తాం. నేషనల్ హైవే సంస్థ ఆధ్వర్యంలో ఏడాదిలో రూ.200 కోట్లతో 203 గిరిజన గ్రామాలకు 269 కి.మీ. మేర బీటీ రోడ్లు వేశాం. ప్రస్తుతం గిరిజన జిల్లాల మీదుగా 515 కి.మీ. పొడవున రూ.8,570 కోట్ల విలువైన జాతీయ రహదారుల పనులు జరుగుతున్నాయి. వీటిలో పాడేరు-గొండిగూడ, కొయ్యూరు-చాప్రతిపాలెం, చింతపల్లి, రంపచోడవరం-కొయ్యూరు ఎన్‌హెచ్-516 విస్తరణ పనులు, రాయపూర్-విశాఖపట్నం సెక్షన్ ఎన్‌హెచ్-130సీడీ, భద్రాచలం-కుంటఎన్‌హెచ్ 30 సెక్షన్, లంబసింగి-పాడేరు, చింతూరు-మోటు సెక్షన్లు, పాడేరు బైపాస్, కొత్త ఫ్లై ఓవర్లు ఉన్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు.

### విజయవాడ, తిరుపతి, విశాఖలో స్టడీ సర్కిళ్లు

పోటీ పరీక్షలకు ఎస్టీ విద్యార్థులను సిద్ధం చేయడానికి రూ.4.5 కోట్లు ఖర్చు చేస్తున్నాం. విశాఖ, విజయవాడ, తిరుపతిలో స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేస్తున్నాం. రూ.150 కోట్లతో రెసిడెన్షియల్ పాఠశాల భవనాలను వసతి గృహాలుగా మార్చుతున్నాం. రూ.64 కోట్ల వ్యయంతో పాడేరు ఐటీడీ పరిధిలో 418 పాఠశాల భవనాల నిర్మాణాలు చేపట్టాం. పాడేరులో ప్రభుత్వ మెడికల్ కాలేజీతో పాటు ఆస్పత్రి నిర్మాణం చేపట్టాం. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని వై రామవరం మండలాన్ని పరిపాలనా సౌలభ్యం కోసం 2 మండలాలుగా విభజించాలని నిర్ణయం తీసుకున్నాం. వీటితో పాటు రూ.50 కోట్లతో సీతంపేట, పార్వతీపురం, రంపచోడవరం, కేఆర్‌పురం, శ్రీశైలం ఐటీడీఏ పరిధిలో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మిస్తున్నాం. త్వరలోనే వీటిని పూర్తి చేసి గిరిజనులకు అందుబాటులోకి తెస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

### ఎన్ని ఇబ్బందులున్నా సూపర్ సిక్స్ హామీల అమలు

ఆర్థిక సమస్యలు ఉన్నా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. ఆగస్టు 15 నుంచి స్త్రీశక్తి పథకం ద్వారా ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నాం. మా గిరిజన ఆడబిడ్డలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణం చేయవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశాం. ఏజెన్సీలో 7 క్యాంటీన్ల ద్వారా భోజనం అందించే ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ నెలాఖరున మెగా డీఎస్సీ ద్వారా టీచర్ల నియమాకం భర్తీచేస్తాం. ఇప్పటికే రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు కుదుర్చుకున్నాం. ఈ పెట్టుబడుల ద్వారా 9 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. 5 వేల మంది గిరిజన మహిళలకు ఏడాదికి రూ.లక్ష ఆదాయం వచ్చేలా చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు.

### గిరిజన యూనివర్సిటీని పూర్తి చేస్తాం

1483 గిరిజన హ్యాబిటేషన్లకు రూ.2,850 కోట్ల వ్యయంతో గ్రామీణ సడక్ యోజన కింద ప్రతి ఊరికి రోడ్డు వేస్తాం. రూ.1938 కోట్ల వ్యయంతో ఐటీడీఏలో గిరిజనుల ఆదాయం పెంచే మార్గాలు చూపిస్తాం. రూ.8575 కోట్ల వ్యయంతో 515 కిలోమీటర్ల రహదారులు పూర్తి చేస్తాం. రూ.19,411 కోట్లతో 472 కిలోమీటర్ల మేర అంతర్జాతీయ ప్రమాణాలతో రోడ్లు వేస్తాం. ఎకో టూరిజం కోసం రూ.10 కోట్లు మంజూరు చేస్తాం. విజయనగరం జిల్లా కురుపాంలో ట్రైబల్ ఇంజనీరింగ్ కాలేజ్ పనులు జరుగుతున్నాయి. విజయనగరం జిల్లాలో 519 ఎకరాల్లో ట్రైబల్ యూనివర్సిటీ నిర్మాణం త్వరిగతగతిన పూర్తిచేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

### టూరిజం క్లస్టర్లుగా అరకు, లంబసింగి, మారేడుమిల్లి

అరకు, లంబసింగి, మారేడుమిల్లి ప్రాంతాలను టూరిజం క్లస్టర్లుగా తయారుచేస్తాం. రాబోయే రోజుల్లో స్థానికంగా 1000 వరకూ హోమ్ స్టేలు ఏర్పాటు చేసుకునేలా ఆర్థిక సాయం చేస్తాం. పాడేరులో మోదకొండమ్మ ఆలయం అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరు చేస్తున్నాం. స్థానికంగా మహిళా శిశు సంక్షేమం కింద 96 అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. విశాఖ జిల్లాలో గిరిజనులందరికీ గ్రామీణ ఆవాజ్ యోజన కింద 54 వేల ఇళ్లు మంజూరు చేస్తాం. బాబాయిని చంపి నెపం నాపై వేద్దామని కుట్ర చేసిన వారి ఆటలు ఇక సాగనివ్వను. వారి ముసుగులు తొలగించి మీకు రక్షణ కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు.



# అరకు కాఫీకి బ్రాండింగ్

- టాటా సంస్థతో జీసీసీ ఎంఓయూ
- ఐటీడీఏలతో రబ్బర్, కాఫీ బోర్డుల ఒప్పందాలు
- పర్యాటకంలో హెూమ్ స్టేల అభివృద్ధికి ముందుకొచ్చిన ఓయో
- ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో గిరిజనుల అభివృద్ధికి వివిధ సంస్థలతో 21 ఒప్పందాలు



ఏఎస్ఆర్ జిల్లా/ పాడేరు (చైతన్యరథం): గిరిజన ప్రాంతాల అభివృద్ధి, ఆదివాసీలకు జీవనోపాధి అవకాశాలు, వ్యవసాయ అభివృద్ధి, అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించటం లాంటి అంశాల్లో ఏపీ ప్రభుత్వం కీలకమైన ఒప్పందాలను కుదుర్చుకుంది. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో శనివారం ఈ ఒప్పందాలు కుదిరాయి. ప్రభుత్వ, ప్రైవేటు రంగంలోని వివిధ సంస్థలు ఈ ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. అరకు కాఫీ మార్కెటింగ్ సహా వివిధ అటవీ, గిరిజన ఉత్పత్తులకు దేశీయంగా, విదేశాల్లో మార్కెటింగ్ కల్పించేలా ఈ అవగాహనా ఒప్పందాలు కుదిరాయి. రంపచోడవరం ఐటీడీఏ ప్రాంతంలో రబ్బరు సాగును ప్రోత్సహించేందుకు వివిధ మౌలికసదుపాయాల కల్పన, సాగు విస్తరణ కోసం ఐటీడీఏతో కేంద్రీయ రబ్బర్ బోర్డు ఒప్పందం కుదుర్చుకుంది. గిరిజన ఉత్పత్తుల విక్రయాలు, అరకు కాఫీకి ప్రోత్సాహం కల్పించేందుకుగానూ జీసీసీతో ఒప్పందం కుదిరింది. స్థానికంగా డ్వాక్రా మహిళలు రూపొందించిన ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేందుకు ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో అరకు కాఫీ కియోస్క్ లను మెప్మా ద్వారా ఏర్పాటు చేసేందుకు కూడా మరో ఒప్పందం కుదిరింది. ఇక గిరిజన సహకార కార్పొరేషన్ (జీసీసీ) ఉత్పత్తులను అమెరికా లాంటి దేశాల్లో విక్రయించేందుకుగానూ హాతీ సర్వీసెస్ ఎల్ఎల్‌సీ కంపెనీతోనూ జీసీసీ ఒప్పందం చేసుకుంది. యూఎస్ఏలోనూ జీసీసీ సంస్థ తన రిటైల్ ఆపరేషన్స్ చేపట్టేలా ఈ ఒప్పందం తోడ్పడనుంది. గిరిజన ఉత్పత్తులను ఏపీతో పాటు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో విక్రయించేందుకు గానూ ట్రైఫెడ్ -ఏపీ జీసీసీలు సంయుక్తంగా రీటైల్ షోరూమ్‌లను ఏర్పాటు చేసేందుకు ఈ రెండు సంస్థల మధ్య ఒప్పందం కుదిరింది. గిరిజనుల ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు ఉద్దేశించి ఈ ఒప్పందం తోడ్పడనుంది. అలాగే షోరూముల వద్ద అరకు కాఫీ కియోస్క్‌లను ఏర్పాటు చేయాలని కూడా ఒప్పందంలో అవగాహన కుదిరింది. ప్రముఖ కార్పొరేట్ దిగ్గజం టాటా కన్స్యూమర్స్ సంస్థ కూడా ఆర్గానిక్ అరకు కాఫీని బ్రాండ్ చేసేందుకు, మార్కెట్ చేసేందుకు జీసీసీతో ఒప్పందం చేసుకుంది. చింతపల్లిలో రెడ్ చెర్రీ పండ్ల రైపెనింగ్, ప్రాసెసింగ్ యూనిట్ సహా మౌలిక సదుపాయాల కల్పన కోసం సబ్ కో సంస్థ ఎంఓయూని కుదుర్చుకుంది.

## హెూమ్ స్టేల అభివృద్ధికి ఎంఓయూలు

ప్రస్తుతం ఉన్న ప్రాంతంతో పాటు అదనంగా 1600 హెక్టార్లలో కాఫీ ప్లాంటేషన్ విస్తరించేందుకు ఐటీసీ సంస్థ పాడేరు ఐటీడీఏతో ఒప్పందం చేసుకుంది. ఇప్పటికే 4010 హెక్టార్లలో స్థానిక రైతుల సహకార సంస్థతో కలిసి ఐటీసీ కాఫీని సాగుచేస్తోంది. కాఫీ బోర్డు కూడా గిరిజన ప్రాంతాల్లో కాఫీ సాగు విస్తరణ, నాణ్యమైన కాఫీ పంట ఉత్పత్తి, సాగులో సుస్థిర విధానాల అమలు కోసం ఒప్పందం చేసుకుంది. గిరిజన మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు గ్రామీణ ప్రాంతాల్లో మార్కెటింగ్ కల్పించే అంశంపై ఫ్రాంటియర్ మార్కెటింగ్, ఈజీ మార్ట్ సంస్థలు ప్రభుత్వంతో ఒప్పందాన్ని చేసుకున్నాయి. పసుపు ఉత్పత్తి, వివిధ టర్మరిక్ ఉత్పత్తులకు మార్కెటింగ్‌ను అనుసంధానించటం, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం ఎక్విప్ సంస్థ ఐటీడీఏతో ఎంఓయూ కుదుర్చుకుంది. సీజన్ల వారీగా ఉత్పత్తయ్యే అటవీ ఉత్పత్తులను గిరిజన మహిళా సంఘాల ద్వారా విక్రయించేందుకు వీలుగా అవగాహన కల్పించేందుకు ఐఎస్బీ సంస్థ మరో కీలకమైన ఒప్పందం చేసుకుంది. ఇక పర్యాటక రంగంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా గిరిజన ప్రాంతాల్లో హెూమ్ స్టేలను ఏర్పాటు చేసేందుకు ఓయో హెూమ్స్, హెూమీ హట్స్ సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. గిరిజన విద్యార్థుల్లో నైతిక విలువల పెంపుకోసం మార్పు సొసైటీ కూడా ఎంఓయూ చేసుకుంది. అలాగే ప్రకృతి సేద్యం, మార్కెటింగ్ సదుపాయాలు, జీవనోపాధి, తదితర అంశాల్లోనూ అవగాహనా ఒప్పందాలు కుదిరాయి. గిరిజన పర్యాటక సర్క్యూట్ అభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగు పర్చేందుకు ఏపీ టూరిజం ఫోరం ముందుకు వచ్చింది.
















అమరావతిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి శనివారం పలువురు మహిళా నేతలు, బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, మాజీమంత్రి పీతల సుజాత, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, టీడీపీ అంగన్వాడీ విభాగం అధ్యక్షురాలు ఆచంట సునీత, బ్రహ్మకుమారీలు సీఎంకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు వారికి ధన్యవాదాలు తెలిపి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

## రాఖీ పండుగ రోజు ఆడబిడ్డలకు పట్టాల పంపిణీ..

# ఎంతో సంతృప్తి ఇచ్చింది

- 2029 నాటికి ప్రతి ఒక్కరికీ సొంతింటి కలను నిజం చేస్తాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టీకరణ
- నెల్లూరు భగత్ సింగ్ కాలనీలో 633 మందికి పట్టాల పంపిణీలో వర్చువల్‌గా పాల్గొన్న సీఎం



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో 2029 నాటికి ప్రతి ఒక్కరికీ సొంతింటి కలను నిజం చేస్తామని సీఎం చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో 3సెంట్ల ఇంటి స్థలం ఇస్తామనే హామీని అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఇదే సమయంలో పేదలు రెండు మూడు దశాబ్దాలుగా ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటే వాటిని రెగ్యులరైజ్ చేస్తామని చెప్పారు. ఈ విషయాన్ని ఇప్పటికే ఎమ్మెల్యేలకు చెప్పామని...పలుచోట్ల వారు చొరవ తీసుకుని అర్హులకు పట్టాలు ఇప్పించడం అభినందనీయమని అన్నారు. నెల్లూరు భగత్ సింగ్ కాలనీలో 633 మందికి పట్టాల పంపిణీ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు శనివారం వర్చ్యువల్‌గా పాల్గొన్నారు. పురపాలక మంత్రి, స్థానిక ఎమ్మెల్యే నారాయణ విన్నపం మేరకు పట్టాల పంపిణీ కార్యక్రమంలో వర్చ్యువల్‌గా పాల్గొన్న సీఎం చంద్రబాబు మాట్లాడుతూ:...రాఖీ పండుగ రోజు ఆడబిడ్డలకు ఇళ్లపట్టాలు పంపిణీ చేయడం ఎంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. నెల్లూరు భగత్‌సింగ్ కాలనీలో పట్టాలు అందుకున్న 633 మందికి శుభాకాంక్షలు. ఎక్కడ ఏ అవకాశం ఉన్నా పేదలకు సాయం చేయడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుంది. నెల్లూరులో చొరవ తీసుకుని అన్ని సాంకేతిక సమస్యలు పరిష్కరించి మహిళలకు పట్టాలిచ్చిన నారాయణకు అభినందనలు తెలుపుతున్నానన్నారు. పేదలను ఆదుకునేందుకు సూపర్ సిక్స్ సహా అన్ని పథకాలు అమలు చేస్తున్నామని....సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయిందని సీఎం అన్నారు. ఎంతమంది పిల్లలున్నా తల్లికి వందనం ఇస్తున్నామని....ప్రభుత్వం ఇచ్చే పింఛన్లు, ఉచిత గ్యాస్, తల్లికి వందనం, అన్నదాత సుఖీవభ, అన్న క్యాంటీన్‌లు వంటి సంక్షేమ కార్యక్రమాలతో పేదల జీవన ప్రమాణాలు పెంచుతున్నామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యంతో ఆడబిడ్డలకు మరింత మేలు జరుగుతుందని సీఎం అన్నారు.

ఈ పట్టాల పంపిణీ కార్యక్రమం సందర్భంగా మస్తానమ్మ, సయ్యద్ సబీహా అనే మహిళలు సీఎంతో మాట్లాడారు. దశాబ్దాలుగా తాము ఇక్కడ నివాసం ఉంటున్నా...ఈ రోజు ప్రభుత్వ చొరవ వల్ల తమకు పట్టాలు వచ్చాయని సంతోషం వ్యక్తం చేశారు. దీనికి కారణమైన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వం తమను పట్టాల పంపిణీ పేరుతో మోసం చేసిందని....కానీ కూటమి ప్రభుత్వంలో మంత్రి నారాయణ సహకారంతో తమకు కలగా మిగిలిన పట్టాలు నేడు తమ చేతికి వచ్చాయని సంతోషం వ్యక్తం చేశారు.

### ఇదీ నేపథ్యం...

నెల్లూరు భగత్ సింగ్ కాలనీలో 1400 మంది పేదలకు శాశ్వత ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. భగత్ సింగ్ కాలనీ 54వ డివిజన్‌లో వెంకటేశ్వరపురం హైవేను ఆనుకుని ఉంటుంది. ఇక్కడ సుమారు 20 ఏళ్ల నుంచి కొంతమంది పేదవారు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు. ఆ తర్వాత కొంతమంది పక్కా ఇళ్లు నిర్మించుకున్నారు. ఇక్కడివారికి కనీస మౌలిక వసతులు లేవు. తాగడానికి నీరు, కరెంట్, రోడ్లు, వీధి లైట్లు, కాలువలు వంటి సదుపాయాలు లేవు. 2014లో టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే భగత్ సింగ్ కాలనీకి సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టారు. ఈ కాలనీలో మొత్తం 1400 కుటుంబాలున్నాయి. ప్రతి ఇంటికి మంచినీటి సౌకర్యం, రోడ్లు, కాలువలు వీధిలైట్లు వంటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. అయితే 2019కు ముందే ఇక్కడి వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ప్రయత్నాలు చేసినా... కొన్ని కారణాల వల్ల జరగలేదు.

2019లో ప్రభుత్వం మారిపోవడంతో కాలనీ వాసులకు ఇళ్ల పట్టాలు రాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టాల ప్రక్రియ వేగవంతమైంది. సర్వేచేసి, అన్ని రికార్డులు పరిశీలించి 1429 మందికి పట్టాలు ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. 1400 మంది పేదలకు శాశ్వత ఇళ్ల పట్టాలు ఇవ్వాల్సి ఉండగా...తొలివిడతలో 633 మందికి ఆన్‌లైన్‌లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు.



మైదాన ప్రాంతాలతో సమానంగా

## ఏజెన్సీ అభివృద్ధి

- ఎక్స్‌లో సీఎం చంద్రబాబు

అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ సోదర సోదరీమణులందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాలను మైదాన ప్రాంతాలతో సమానంగా అభివృద్ధి చేసి... ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఏడాది కాలంలో ఏజెన్సీ ప్రాంతాల్లో అభివృద్ధి కోసం, గిరిజనుల సంక్షేమం కోసం పలు చర్యలు తీసుకున్నామన్నారు. ఆదివాసీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.



అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం, వంజంగిలో శనివారం అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి స్వాగతం పలికిన జిల్లా మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు.











ప్రపంచ
ఆదివాసీ దినోత్సవం సందర్భంగా
అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం
వంజంగి వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
వనదేవత మోదకొండమ్మను దర్శించుకున్నారు. గ్రామంలోని కాఫీ ప్లాంటేషన్లోని తోటలను పరిశీలించారు. అనంతరం కాఫీ ప్లాంటేషన్ పెంపకందారులతో చంద్రబాబు మాట్లాడారు. ప్రజావేదిక వద్ద గిరిజన ప్రాంతంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పథకాలకు శంకుస్థాపనలు... ప్రారంభోత్సవాలు చేశారు. ఉత్పత్తులకు సంబంధించిన స్టాళ్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా అక్కడ పండించిన అరకు కాఫీ పొడితో తయారైన కాఫీ సేవించారు. తరువాత దీనిపై ఎక్స్‌లో సీఎం చంద్రబాబు పోస్ట్ చేశారు. ఒక కప్పు తాజా అరకు కాఫీని మించినది ఏదీ లేదన్నారు. ముఖ్యంగా అది పండిన చోట, ప్రకృతి ఒడిలో అరకు కాఫీని ఆస్వాదించిన అనుభూతి అనిర్వచనీయమన్నారు. మన గిరిజన సమూహాలు ఈ ప్రత్యేకమైన పానీయానికి ప్రాణం పోశాయని కొనియాడారు.





















చైతన్యరథం

# మంగళగిరి ఆడపడుచులు

# నా అక్కాచెల్లెళ్లు!









- వారికి ఎల్లప్పుడూ రుణపడిఉంటా
- మీ ఆశీస్సులతో నియోజకవర్గాన్ని నెం.1గా తీర్చిదిద్దుతా
- మంత్రి నారా లోకేష్ ఉద్ఘాటన
- మంత్రికి రాఖీలు కట్టిన మంగళగిరి మహిళలు

ఉండవల్లి(చైతన్యరథం): నాకు సొంతంగా అక్కలు, చెల్లెళ్లు లేరు..మంగళగిరి మహిళలే నా అక్కాచెల్లెళ్లు.. ఈరోజు మీరంతా రాఖీకట్టి నాకు అందించిన ఆశీస్సులు కొండంత బలాన్నిచ్చాయి..మీ ఆశీస్సులతో మంగళగిరి నియోజకవర్గాన్ని రాష్ట్రంలో నెం.1గా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. రాఖీపౌర్ణమిని పురస్కరించుకొని మంగళగిరి నియోజక వర్గానికి చెందిన మహిళలు శనివారం ఉండవల్లి నివాసానికి వచ్చి మంత్రి లోకేష్‌కు రాఖీలు కట్టి ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... మంగళగిరి ఆడబిడ్డలందరికీ తాను ఎల్లప్పుడూ రుణపడి ఉంటాననన్నారు. 2019 ఎన్నికల్లో నేను తొలిసారిగా పోటీచేసినపుడు 5,300 ఓట్లతో ఓటమిచెందాను. అప్పుడు నా రాజకీయ ప్రత్యర్థులు నన్ను విమర్శించడమేగాక కొడుకును గెలిపించుకోలేక పోయారంటూ చంద్రబాబుని కూడా అవమానించారు. అయితే ఓడిన చోటే గెలవాలన్న పట్టుదలతో పనిచేశాను. సొంత నిధులతో 26 అభివృద్ధి కార్యక్రమాలు అమలుచేసి మీ అందరి అభిమానాన్ని చూరగొన్నాను. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో మంగళగిరిలో నన్ను రాష్ట్రంలోనే 3వ అతిపెద్ద మెజారిటీతో గెలిపించి విమర్శించిన వారి నోళ్లు మూయించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నిలబెట్టుకునేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నాను. ఆనాడు ఇచ్చిన హామీల్లో ప్రధానమైనది ప్రభుత్వభూముల్లో నివసించే వారికి శాశ్వత ఇళ్లపట్టాలు. తొలి ఏడాదిలోనే దాదాపు 3వేలమందికి పైగా పేదలకు వెయ్యికోట్ల విలువైన ఆస్తిని పంపిణీచేసి మాట నిలబెట్టుకున్నా. త్వరలోనే మరోవిడత ఇళ్లపట్టాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నా. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంగళగిరి నియోజకవర్గంలో 200 అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించాను. ఇందులో ప్రధానమైన అండర్ గ్రౌండ్ డ్రైనేజి, విద్యుత్, గ్యాస్ పైప్ లైన్ల ఏర్పాటు, 100 పడకల ఆసుపత్రి, స్వర్ణకారుల కోసం జెమ్స్ అండ్ జ్యుయలరీ పార్కు వంటివి పురోగతిలో ఉన్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్లన్నీ అభివృద్ధి చేస్తున్నాం. మహా ప్రస్థానం పేరుతో శ్మశాన వాటికల నిర్మాణం, పార్కుల అభివృద్ధికి చర్యలు చేపట్టాం. ఇలా ఇచ్చిన ప్రతిహామీని నిలబెట్టుకోవడానికి నిరంతరం కృషిచేస్తున్నాను. మీరు ఇచ్చిన భారీ మెజారిటీ నా బాధ్యతను మరింత పెంచింది. మీరు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు రెట్టింపు కష్టపడుతున్నా. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా మంగళగిరి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నా. మీ అందరి సహకారంతో మంగళగిరిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.









## ఆడపడుచుల అనురాగబంధమే మా బలం

**- మంత్రి నారా లోకేష్**

అమరావతి (చైతన్యరథం): తోడబుట్టిన అక్కాచెల్లెళ్లు లేని తనకు దేవుడిచ్చిన కోట్లాది మంది తోబుట్టువులకు విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. తల్లికి వందనం చేసి, స్త్రీశక్తిని మహాశక్తిగా మార్చే మా సంకల్పానికి ఆడపడుచుల అనురాగబంధమే బలం అన్నారు. రక్షాబంధన్ పండుగ సందర్భంగా మీరు కడుతున్న రాఖీ సాక్షిగా ఇదే నా హామీ.. అన్నగా, తమ్ముడిగా మీ రక్షణ మా బాధ్యత అని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

## గిరిజనులకు అన్నివిధాల అండగా ఉంటాం

**- మంత్రి లోకేష్ ఆదివాసీ దినోత్సవ శుభాకాంక్షలు**

అమరావతి (చైతన్యరథం): ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజన సోదరసోదరీమణులకు విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలకు, నిరాడంబరతకు నిలువుటద్దంగా నిలిచే జీవనశైలి ఆదివాసుల సొంతం అన్నారు. కూటమి ప్రభుత్వంలో ఆదివాసీల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం నిత్యం కృషి చేస్తున్నామన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.7,557కోట్ల నిధులను వారి సంక్షేమం కోసం వెచ్చించామని, భవిష్యత్ లోనూ గిరిజన సోదరులకు అన్ని విధాల అండగా నిలుస్తామని మంత్రి లోకేష్ ఉద్ఘాటించారు.

## రజనీ యుగంలో పుట్టడం మా అదృష్టం

**- 50 ఏళ్ల సినీ జీవితం పట్ల మంత్రి లోకేష్ అభినందనలు**

అమరావతి (చైతన్యరథం): సూపర్‌స్టార్ రజనీకాంత్ 50 ఏళ్ల సినీ జీవితాన్ని పూర్తి చేసుకోవటం పట్ల విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ అభినందనలు తెలియజేశారు. రజనీ యుగంలో ప్రేక్షకులుగా జీవించి ఉండటం తమ అదృష్టం అన్నారు. అంతే కాకుండా కష్ట సమయంలో తమ కుటుంబానికి రజనీ ఇచ్చిన అచంచల మద్దతును తాము ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. ఆయన తాజా సినిమా కూలీ గొప్ప విజయం సాధించాలని మంత్రి లోకేష్ ఆకాంక్షించారు.

# హైస్కూళ్ల రూపురేఖలు మారుస్తాం

- వీఆర్సీ తరహాలో ఆధునికీకరిస్తాం
- పీ4తో పాఠశాలలను ఆధునికీకరిస్తాం
- మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ
- నెల్లూరులో వీఆర్‌సీ హైస్కూల్ పరిశీలన



నెల్లూరు(చైతన్యరథం): కార్పొరేషన్ పరిధిలోని 11 ప్రభుత్వ హైస్కూళ్లను వచ్చే విద్యా సంవత్సరంలో అన్ని హంగులతో సిద్ధం చేస్తామని పురపాలక, పట్టణాభివృద్ధి మంత్రి పొంగూరు నారాయ ణ తెలిపారు. నగరంలోని మూలాపేట బాలికల ఉన్నత పాఠశాల, వీఆర్‌సీ పాఠశాల, ఆర్ఎస్ఆర్ పాఠశాలను శనివారం ఆయన పరి శీలించారు. వీఆర్సీ తరహాలోనే పాఠశాలలను తీర్చిదిద్దుతామని వివరించారు. ముందుగా మూలాపేట బాలిక ఉన్నత పాఠశాలలో సీఎస్ఆర్ ఫండ్స్‌తో ఆధునికీకరణ పనులు చేపట్టిన డీఎస్ఆర్ కన స్ట్రక్షన్ అధినేత సుధాకర్‌రెడ్డితో మాట్లాడారు. శరవేగంగా జరుగు తున్న పనులను పరిశీలించారు. నూతన భవన నిర్మాణాలపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం వీఆర్‌సీ పాఠశాలలో కార్పొ రేషన్, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. హైస్కూల్ నిర్వహణపై సూచనలు చేశారు. పాఠ శాల మెయింటెనెన్స్‌పై నిర్లక్ష్యం వహించవద్దని తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు పేరెంట్స్ అభిప్రాయాలు తీసుకుని ముందుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. ఎంపీ వీపీఆర్ దత్తత తీసుకున్న ఆర్ఎస్ఆర్ స్కూల్ ఆధునికీకరణకు సిద్ధం చేసిన డిజైన్‌ను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 2014-19లో వీఆర్ హైస్కూల్‌లో ఇంటర్ విద్యార్థులకు కాంపిటేటివ్ పరీక్షలకు శిక్షణ ఇచ్చామని చెప్పారు. శిక్షణకు అయ్యే ఖర్చును కార్పొరేషన్ భరిం చింది..టీచర్లకు నెలకు ఆరు లక్షల జీతాలు నారాయణ గ్రూప్ చెల్లించింది..మంచి ఫలితాలు కూడా వచ్చాయి. ఐఐటీ, ఎన్ఐటీ, మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థులతో అప్పటి మేయర్ అజీజ్ ర్యాలీ కూడా నిర్వహించారని గుర్తుచేశారు. అయితే తమ మీద కోపంతో వైసీపీ ప్రభుత్వం దానిని మూసేసిందని మండిపడ్డారు. నగర నడిబొడ్డులోని స్కూల్‌ను కూడా మూసేశారని, దానిని పునః ప్రారంభిస్తానని ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ అంత ర్జాతీయ ప్రమాణాలతో సిద్ధం చేసి మాట నిలబెట్టుకున్నామన్నారు. పేద పిల్లలకు కార్పొరేట్ విద్యను అందుబాటులోకి తెచ్చామన్నారు. పీ4 కార్యక్రమం ద్వారా అన్ని స్కూల్స్‌ను ఆధునికీకరిస్తామని చెప్పా రు. మూలాపేట బాలికోన్నత పాఠశాల, ఆర్ఎస్ఆర్ స్కూల్స్‌ను డీఎస్సార్ బ్రదర్స్, ఎంపీ వేమిరెడ్డిలు అధునీకరిస్తున్నారని.. మరి కొంతమంది కూడా ముందుకు వస్తున్నారని తెలిపారు. పేద పిల్లలకు విద్యనే ఆస్తిగా అందిస్తామని.. వేలాదిమంది నిరుపేద పిల్లలకు కార్పొరేట్ తరహా విద్యను ఉచితంగా అందించటమే లక్ష్యమన్నారు. నగరంలోని 11 హైస్కూళ్లను వచ్చే విద్యా సంవత్స రానికి సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఐదేళ్లలో కార్పొరేషన్ పరిధిలోని అన్ని స్కూళ్ల రూపురేఖలు మారుస్తామని వివరించారు. ఈ కార్యక్ర మంలో కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ కుమార్ యాదవ్, డీఈవో బాలాజీరావు, మాజీ జెడ్పీటీసీ విజేతరెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు మామిడాల మధు, డివిజన్ కో క్లస్టర్ పోకల రవి, వైస్ ప్రెసిడెంట్ చిరంజీవి, యూనిట్ ఇన్‌చార్జి మహేష్, డీఎస్సార్ కన్‌స్ట్రక్షన్స్ ఎండీ అనీల్‌రెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ అన్నంగి ప్రసాద్, టీడీపీ ముఖ్యనేతలు పాల్గొన్నారు.

## గంజాయికి దూరంగా ఉండండి

- రవాణాలో పట్టుబడిన ఖైదీలకు హోంమంత్రి అనిత ఉద్బోధ
- విశాఖ కేంద్ర కారాగారంలో అధికారులు, ఖైదీలకు రాఖీలు కట్టిన మంత్రి



విశాఖపట్నం (చైతన్యరథం): యువత మంచి,చెడులు తెలుసుకుని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత హితవు పలికారు. రాఖీ పండుగ సందర్భంగా శనివారం విశాఖ కేంద్ర కారాగారానికి వెళ్లిన మంత్రి అనిత.. జైలు అధికారులకు, 30 మంది యువ ఖైదీలకు రాఖీలు కట్టారు. గంజాయి రవాణాలో పట్టుబడిన ఖైదీలకు వారు చేసిన నేరం, భవిష్యత్‌లో ఎదురయ్యే పర్యవసానాలపై అవగాహన కల్పించారు. యువత మంచి, చెడులను తెలుసుకోవాలన్నారు. తెలిసీ తెలియని వయస్సులో ఈజీమనీ కోసం ఆలోచిస్తే, జీవితాలు నాశనం అయిపోతాయని హెచ్చరించారు. బంగారు భవిష్యత్తులను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. బతకడానికి చాలా అవకాశాలు ఉన్నాయన్నారు. గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. ఖైదీలందరూ విడుదలై వచ్చే సంవత్సరం ఇంటి దగ్గరే రాఖీపౌర్ణమి జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## ఖాళీ స్థలం ఆక్రమించి వైసీపీ నేత దందా

- అనుమతులు లేకుండా షెడ్ నిర్మాణం
- ప్రశ్నిస్తే కేసు పెడతామంటున్నారు
- ప్రజావినతుల్లో బాధితురాలి ఫిర్యాదు

మంగళగిరి(చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో ఏపీఈడబ్ల్యూబీసీ చైర్మన్ కుప్పం రాజశేఖర్, టైలర్స్ కార్పొరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి అర్జీలు స్వీకరించారు. ఇంటి ముందు ఆర్ అండ్ బీ రోడ్డు తో పాటు తమ ఇంటికి అనుకుని ఉన్న స్థలాన్ని పండు నాగార్జున అనే వైసీపీ నేత అనుమతి లేకుండా ఆక్రమించి రేకుల షెడ్ నిర్మించాడని కృష్ణాజిల్లా బాపులపాడు మండలం పెరికీడు గ్రామం పడవల పావని ఫిర్యాదు చేసింది. తన అనుచరు లతో బెల్ట షాపు, మద్యం కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని, దాంతో పొరుగు వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఫిర్యాదుచేసినా ఎటువంటి చర్యలు లేవని వివరించింది. అతన్ని పిలిచి రేకుల షెడ్‌ను ఖాళీ చేయమని అడుగగా రూ.5 లక్షలు డిమాండ్ చేస్తూ అవసరమైతే కుల దూషణ కేసు పెడతానని రాజకీయ నాయకుల మద్దతుతో బెదిరిస్తున్నాడని వివరించింది. ఆయనపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని అభ్యర్థించారు. 2017లో ఎన్టీఆర్ హౌసింగ్ పథకం కింద ఇల్లు మంజూరైందని తిరుపతి జిల్లా గూడూరు నియోజకవర్గానికి చెందిన సయ్యద్ మస్తాన్ బాషా తెలిపారు. మొదటి బిల్లు రూ.14,450 జమ కాగా మిగిలిన బిల్లులు ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయాయని వివరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 5 సంవత్స రాలుగా ఒక్క రూపాయి కూడా మంజూరు కాలేదని తెలిపారు. అప్పు తీసుకుని ఇల్లు స్లాబ్ వరకు నిర్మించామని, అప్పుల భారం నుంచి బయటపడేందుకు మిగిలిన బిల్లులను తక్షణమే ఇప్పించి ఆదుకోవాలని అభ్యర్థించారు.

## గిరిజనులకు అండగా కూటమి ప్రభుత్వం

- అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంలో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం (చైతన్యరథం): గిరిజనుల సంక్షేమంకోసం 7,557కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం కేటా యించిందని, ఆదివాసీలలో చైతన్యం తీసుకువచ్చి వారిని అభివృద్ధి పథంలో నడిపిస్తామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్‌శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా శని వారం ఉదయం మచిలీపట్నం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి రవీంద్ర తొలుత అధికారులతో కలిసి ఏకలవ్యుడు, స్వాతంత్ర సమర యోధులు అల్లూరి సీతారామరాజు, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఎస్టీల ఆరాధ్యదైవం సేవా లాల్, చెంచులక్ష్మి, వెన్నెలకంటి రాఘ వయ్యల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

అనంతరం మంత్రి రవీంద్ర



మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా అన్నిజిల్లాల లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవంరూపు కుంటున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల సంక్షేమంకోసం 7,557కోట్ల రూపాయల వ్యయంతో అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. ఐటీడీఏల ద్వారా గిరిజనుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రభుత్వం పథ కాలను, కార్యక్రమాలను గిరిజనులు అందిపుచ్చుకొని ఉన్నత స్థాయికి చేరు కోవాలన్నారు. మచిలీపట్నం మండలం లోని నారాయణపురం కాలనీకి జిల్లా కలెక్టర్‌తో కలిసి వెళ్లిన సమయంలో అక్కడ ఎస్టీలకు ఆధార్ కార్డులు లేవనే విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. అప్పటినుండి వారికి ఆధార్ కార్డులు ఇప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నా మన్నారు. ఒక్కో గిరిజన కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరాచేసి వారిని ఆదుకుంటున్నామ న్నారు. గిజనుల ఇళ్లపై పీఎం సూర్యా ఘర్ పథకం కింద సౌర ఫలకాలను పైసా ఖర్చులేకుండా ఉచితంగాఏర్పాటు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని అంద రూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## పులివెందులలో ధర్మానికి, అధర్మానికి మధ్య యుద్ధం: మంత్రి సవిత

కడప (చైతన్యరథం): పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల్లో ధర్మానికి, అధర్మానికి మధ్య యుద్ధం జరుగు తోందని కడప జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎస్ సవిత అన్నారు. జెడ్పీటీసీ ఎన్నికల ప్రచారానికి ఆదివారం చివరి రోజు కావడంతో కూటమి అగ్రనేతలు, మంత్రులు శనివారం జోరుగా ప్రచారం చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి ఎస్ సవిత, పులి వెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి,తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లా డుతూ.. గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రమంతా పులి వెందుల జెడ్పీటీసీ ఎన్నిక వైపే చూస్తోం దని మంత్రి సవిత అన్నారు. కూటమి ప్రభుత్వహయాంలో పులివెందుల్లో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు.



ఏపీలో ఇప్పుడున్న పింఛన్ విధానం ప్రపంచంలోనే లేదని సవిత పేర్కొన్నా రు. బడుగు, బలహీన వర్గాలపై గత జగన్‌రెడ్డి అణిచివేతకు పాల్పడిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం మాత్రం వారికి అండగా ఉంటూ అభి వృద్ధి చేస్తోందన్నారు. పులివెందులకు ఇప్పటివరకూ నీళ్లిచ్చిన ఘనత సీఎం చంద్రబాబుదే అని స్పష్టం చేశారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనే ఒక వ్యక్తికోసం.. సొంత నియోజకవర్గంలోని పులివెందుల ఎర్రచెరువుకు జగన్‌రెడ్డి నీళ్లు ఇవ్వలేదని పులివెందుల టీడీపీ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి మండిపడ్డారు. ఎర్ర చెరువుకు త్వరలో నీళ్లు ఇస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఎర్రచెరువుకు నీళ్లించ్చేందుకు సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని హర్షం వ్యక్తం చేశారు. గత జగన్ ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి నోచుకోలేదని ధ్వజమెత్తారు. గత ప్రభు త్వంలో దందాలు,అక్రమాలు తప్ప అభి వృద్ధి జరగలేదని బీటెక్ రవి విమర్శలు గుప్పించారు.

ఇలాఉంటే పులివెందుల టీడీపీ ఇన్ ఛార్జ్ బీటెక్ రవి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి పెద్దఎత్తున టీడీపీలో చేరికలు జరుగుతున్నాయి. రోజూ చేరికలతో టీడీపీలో జోష్ పెరుగుతోంది.

## విశాఖలో అట్టహాసంగా క్రీడా ఉత్సవం



- ప్రారంభించిన పల్లా శ్రీనివాసరావు
- ఘనంగా వీఎంఆర్‌డీఏ వ్యవస్థాపక దినం

విశాఖపట్నం(చైతన్యరథం): వీఎంఆర్‌డీఏ వ్యవస్థాపక దినో త్సవాన్ని పురస్కరించుకుని చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్, మెట్రో పాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా ఉత్సవం అట్టహాసంగా ప్రారంభమైంది. శనివారం పోర్ట్ స్టేడియం వేదికగా జరిగిన క్రీడా ఉత్సవాన్ని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్యే గణబాబు, ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామల దీపిక, క్రెడాయ్ పూర్వ అధ్యక్షుడు ధర్మేంద్ర, విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ అధినేత బొడ్డేటి కాశీవిశ్వనాథ్ జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా ఉత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం క్రికెట్, టగ్ ఆఫ్ వార్ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు బ్యాటింగ్ చేయగా, పశ్చిమ ఎమ్మెల్యే గణ బాబు బౌలింగ్ చేశారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ ఇలాంటి క్రీడా ఉత్సవాలు నిర్వహించటం వల్ల నిత్యం విధి నిర్వహణలో ఉండే ఉద్యోగు లకు మానసిక ఉల్లాసం కలుగుతుందని, విధుల్లో మరింత రెట్టింపు ఉత్సాహం గా పనిచేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్ర మంలో వీఎంఆర్‌డీఏ ప్రధాన గణాంకాధికారి హరిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

## దళితులకు జగన్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

- తిరుపతిలో యువకుడిపై దాడి సిగ్గుచేటు
- దళితుల అణచివేతను సహించేది లేదు
- నిందితులపై కేసు నమోదు చేయాలి
- ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



మంగళగిరి(చైతన్యరథం): ఏపీలో దళితులపై జరుగుతున్న దాడులపై వైసీపీ అధినేత జగన్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు వ్యవ హరిస్తున్న తీరును ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తీవ్రంగా ఖండించారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా దళితులపై నిరంకుశత్వ వైఖరి మారలే దని ధ్వజమెత్తారు. ఇటీవల వైసీపీ కార్యకర్త సింగయ్య మృతి చెందిన సమయంలో జగన్‌రెడ్డి వ్యవహరించిన తీరు దళితులపై వారికి ఉన్న నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమన్నారు. సింగయ్య మృతి చెందిన తర్వాత, కారు కింద పడిపోయినా పట్టించుకోకుండా వెళ్లిపోవడం సభ్య సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేశాయన్నారు. ఒక దళిత కార్యకర్త విషయంలో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం దళితుల ప్రాణాలంటే వైసీపీ ఎంత చులకనో నిరూపించిందన్నారు. తిరుపతిలో భూమన కరుణాకర్‌రెడ్డి, ఆయన అనుచరులు దినేష్ రెడ్డి, అనిల్‌రెడ్డి దళిత యువకుడిపై విచక్షణారహితంగా దాడి చేశా రు. వీడియో తీసి దళిత యువకుడు పవన్ తండ్రికి పంపించి పైశాచిక ఆనందం పొందడం అమానుషం, అమానవీయం. ఈ చర్యను ఏ నాగరిక సమాజం కూడా సహించదని ధ్వజమెత్తారు. 2019-24 మధ్య వైసీపీ పాలనలో దళితులపై జరిగిన దాడులు, అణచివేత దళితుల హక్కులను కాలరాశాయి. మాస్క్ అడిగి నందుకు డాక్టర్ సుధాకర్‌ను హింసించారు. మాస్క్ ధరించలేదని దళిత యువకుడు కిరణ్‌ను పోలీసులు వేధించి చిత్రహింసలకు గురిచేసి అతని మరణానికి కారణమయ్యారు. ఇసుక, మద్యం ధరలపై ప్రశ్నించిన దళితులు వరప్రసాద్, ఓం ప్రతాప్‌లను కూడా చిత్రహింసలకు గురిచేసి చంపేశారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యంను చంపి కారులో డోర్ డెలివరీ చేశారు. వైసీపీ పాలనలో దళితుల హక్కులు, చట్టాలను కాలరాశారు. దళితుల కోసం ఉద్దేశించిన 27 పథకాలను రద్దు చేసి సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించారు. దళితుల రాజధానిగా పిలవబడే అమరావతిని నాశనం చేసి దళితు ల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టారు. దళితులు కూటమి ప్రభుత్వానికి మద్దతు తెలపడం వల్లే వైసీపీ నాయకులలో ఈ అక్కసు పెరిగిందని స్పష్టమవుతోంది. తిరుపతిలో దళిత యువకు డు పవన్‌పై దాడి చేసిన భూమన కరుణాకర్‌రెడ్డి, ఆయన అను చరులను వెంటనే ఆ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోరారు. వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠినంగా శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాడు వైసీపీ పాలనలో, నేడు దళితులపై వైసీపీ నేతల దౌర్జన్యాలకు జగన్‌రెడ్డి దళిత జాతికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలి. బాధితుల కుటుంబాలను ఆదు కోవడానికి తగిన సహాయ సహకారాలు అందించాలని కోరారు. దళితులను అణచివేయాలని చూస్తే దళిత జాతి మొత్తం మీ నిరం కుశత్వానికి వ్యతిరేకంగా పోరాడుతుందని, కూటమి ప్రభుత్వం దళితులపై జరిగే దాడులను చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. దోషులు ఎవరైనా సరే కఠినంగా శిక్షించి న్యాయం చేకూరుస్తుం దని స్పష్టం చేశారు. వైసీపీ నాయకులు దళితులపై నిరంకుశ వైఖరి మార్చుకోవాలని హెచ్చరించారు.

# వివేకా కథ కంచికేనా?

సీబీఐ కేసుల్లో విచారణ జరుగుతున్న తీరు, జాప్యం ఆ సంస్థలపై ప్రజల్లో ఉన్న నమ్మకం పూర్తిగా సన్నగిల్లేలా ఉంది. సీబీఐ పంజరంలో చిలకగా మారిందని పలు సందర్భాల్లో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు వివేకానందరెడ్డి హత్యకేసులో నిజమేనని రుజువవుతున్నాయి. టన్నుల కొద్దీ సాక్ష్యాలతో నేరతీవ్రత కళ్లకు కనపడుతున్నా విచారణ ఏళ్ల తరబడి సాగదీసి చివరకు కేసులను మూసివేస్తున్నారు. హంతకులపై, అవినీతిపరులపై కేసులు విచారించేందుకు 1963 ఏప్రిల్ 1వ తేదీన సీబీఐ ఆవిర్భవించింది. ఇది నేరస్థులను నిగ్గుతేల్చి శిక్షించడానికి ఉద్దేశించబడింది. ప్రతి ఏడాది డజన్ల కొద్దీ కేసుల విచారణలను చేపడుతున్నా ఎన్ని కేసులు నిజాయతీగా, నిక్కచ్చిగా పూర్తిచేశాయో సీబీఐ ఆత్మపరిశీలన చేసుకోవాలి.

ఈ నైరాశ్యంలో వెలుగురేఖగా నిలుస్తున్నది సునీత పోరాటం. అవినాశ్ రెడ్డి ముందస్తు బెయిల్ రద్దు కోసం, తన తండ్రి హత్యకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సునీత వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. జులై 19న విచారణ జరిగింది. సునీత తన వాదనలను న్యాయవాదిలా ధైర్యంగా కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఇది ఆమె తెగువకు అద్దంపడుతోంది. తన తండ్రిని హత్యచేసిన నిందితులకు శిక్షపడేందుకు కూతురు సునీత చేసిన పోరాటం ఫలితంగా నారాసుర రక్త చరిత్ర కాస్తా.. జగనాసుర రక్తచరిత్రగా మారింది. సునీత పోరాటం చేయకపోతే గొడ్డలిపోటు కాస్తా గుండెపోటుగా మారేది. నిజాలన్నీ సమాధయ్యేవి. ఇన్ని వాస్తవాలు వెలుగులోకి రావడం వెనుక సునీత పోరాటస్ఫూర్తి దాగి ఉంది. వివేకాహత్య కేసుని హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ చేపట్టింది. ఇంతటి సంచలనాత్మకమైన కేసులో జరిగిన జాప్యం, సీబీఐ విచారణ జరిపిన తీరు ఆశ్చర్యం కలగిస్తోంది.

వివేకా హత్య కేసు దర్యాప్తు ముగిసిందని సర్వోన్నత న్యాయస్థానానికి సీబీఐ తెలిపింది. న్యాయస్థానం ఆదేశిస్తే మరలా విచారణ చేస్తామని చెప్పడంలో సీబీఐ ఆంతర్యం ఏమిటో అర్థంకావడం లేదు. కథ ముగిసింది అన్న తర్వాత ఏం విచారిస్తారు, ఎవరిని విచారిస్తారు? వివేకా హత్య జరిగిన రోజు వేకువజామున జగన్ రెడ్డికి ఫోన్ కాల్ వచ్చిందని సీబీఐ వెల్లడించింది. ఈ విషయాన్ని జగన్ సలహాదారుడు అజయ్ కల్లం రెడ్డి సీబీఐకి తెలిపారు. మరి జగన్‌రెడ్డిని విచారించకుండా దర్యాప్తు ఎలా ముగిస్తారు? వివేకాది సహజ మరణమని వార్త ప్రచురించి ప్రచారం చేసింది సాక్షి మీడియా. ఇలాంటి తప్పుడు కథనాల వెనుక ఎవరున్నారో విచారించాలి కదా? ఆ మీడియా యజమాని, అలాగే సహజ మరణంగా చిత్రీకరించడానికి కుట్లువేసి, కట్లుకట్టిన డాక్టర్ల బృందం సాక్షాత్తూ భారతిరెడ్డి కుటుంబ సభ్యులే. అలాంటప్పుడు ఆమెను కూడా విచారించాలి కదా?

సీబీఐ అధికారులపై తప్పుడు కేసులు పెట్టి ముద్దాయి అవినాష్‌రెడ్డిని అరెస్ట్ చేయకుండా అడ్డుకున్న పోలీసు అధికారులను, అప్పటి హోంమంత్రి, ముఖ్యమంత్రిని విచారించాలి కదా. ఇవేవీ చేయకుండా దర్యాప్తు ముగిసిందని చేతులు దులుపుకోవడంలో అత్యున్నత దర్యాప్తు సంస్థపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. సీబీఐ విచారణ జరుపుతున్న కేసుల్లో అపనమ్మకం, అనుమానాలు పెరుగుతున్నాయి. ప్రత్యేకంగా వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో జరిగిన పరిణామాలు తీవ్రమైన చర్చకు దారితీశాయి. దేశంలో అత్యున్నత దర్యాప్తు సంస్థగా పేరుగాంచిన సీబీఐ... నేడు ప్రతి కీలక కేసులో మొదటగా దూకుడుగా వ్యవహరిస్తోంది. అనంతరం సుదీర్ఘ విచారణల పేరుతో తీవ్రంగా జాప్యం చేస్తూ కేసులను నీరుగారుస్తున్నారు. ఇందుకు వివేకానంద రెడ్డి హత్య కేసే నిదర్శనం.

ఈ కుట్రలో ఎంపీ అవినాష్ రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్ రెడ్డి కీలక పాత్ర పోషించారని సీబీఐ స్వయంగా తన ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది. అవినాష్ రెడ్డిపై సరైన సమయంలో చర్యలు తీసుకోకపోవడం, ఆయనను అరెస్టు చేయడానికి వెళ్లి వెనక్కి రావడం.. ఇవన్నీ ఆ సంస్థ పట్ల ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని దెబ్బతీశాయి. ఏదో అదృశ్య శక్తి వల్ల సీబీఐ వెనకడుగు వేస్తోందన్న అనుమానం ఉంది. వివేకా హత్య కేసులో జగన్మోహన్ రెడ్డి రెడ్డికి ముందే సమాచారం ఉందని సీబీఐ స్పష్టం చేసింది. అయితే ఇప్పటికీ ఆయనను ఒక్కసారి కూడా విచారించలేదు.

జగన్ రెడ్డిపై ఉన్న 11 సీబీఐ, 6 ఈడీ కేసులు ఏ దశలో ఉన్నాయన్నదీ మరో పెద్ద ప్రశ్న. 2011లోనే ఈ కేసులు నమోదయ్యాయి. చార్జిషీట్లలో రూ.43,000 కోట్ల అవినీతి వివరాలు ఉన్నాయి. కానీ విచారణ ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. ఒక సామాన్య పౌరుడిపై ఇలాంటి కేసులుంటే ఎప్పుడో జైలులో ఉండేవారు. కానీ అధికారం, డబ్బుతో జగన్ కేసులు వాయిదాల మీద వాయిదాలు పడుతున్నాయి. ఈ వ్యవహారాలన్నింటితో సీబీఐ విచారణలపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లింది. రాజకీయ పలుకుబడి, అధికారంలో ఉన్నవారి ఒత్తిళ్లు దర్యాప్తు సంస్థలను ప్రాభావితం చేస్తున్నాయి. విచారణను సత్వరం పూర్తిచేయాల్సిన బాధ్యతను మరిచి, దోషులకు వ్యవస్థలు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయన్న అభిప్రాయం బలపడుతోంది.

వివేకా హత్య తాలూకు ఆనవాళ్లు తుడిచి వేయడంలోనూ, గుండెపోటు కథ అల్లడంలోనూ అవినాష్ రెడ్డిదే కీలక పాత్ర అని కోర్టుకు నివేదించింది సీబీఐ కాదా? వివేకానంద రెడ్డి హత్య కేసులో అవినాష్ రెడ్డి అరెస్టుపై హైకోర్టు సుప్రీంకోర్టుకు సీబీఐ పలు సందర్భాల్లో వెల్లడించింది నిజం కాదా? మొదట అవినాశ్ ప్రధాన అనుచరుడు ఉదయ్‌కుమార్ రెడ్డిని సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. ఆ తర్వాత అవినాష్ తండ్రి భాస్కర్ రెడ్డిని అరెస్టు చేయడంతో తర్వాత అరెస్టు అవినాష్ రెడ్డిదే అని అందరు భావించారు. కానీ అవినాష్ తెలంగాణ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ వేయడంతో స్టే ఇచ్చి%శీ%ది తెలంగాణ హైకోర్టు. దీనిపై వివేకా కుమార్తె సునీత సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో అవినాశ్‌కు అరెస్టు నుంచి రక్షణ కల్పించలేమంటూ సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. వివేకానందరెడ్డి హత్యకేసులో విస్తృత కుట్ర కోణంపై దర్యాప్తు జరపాలని సాక్షాత్తూ సుప్రీంకోర్టే సీబీఐని ఆదేశించింది. కానీ అది సక్రమంగా అమలు జరగలేదు.

అవినాశ్ రెడ్డి అరెస్టును ఆపలేం అని సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేసింది. అడ్డంకులేవీ లేకున్నా అవినాష్ అరెస్టు మాత్రం ఎందుకు జరగలేదు? ఈ కేసులో తండ్రీ కొడుకులు భాస్కర్ రెడ్డి, అవినాష్ రెడ్డి మొదట సాక్షులుగా, తర్వాత అనుమానితులుగా, చివరికి నిందితులుగా మారారు. వివేకా హత్యకు కుట్ర పన్నింది వాళ్లేనని, దేవిరెడ్డి శంకర్ రెడ్డి ద్వారా హత్య చేయించారని సీబీఐనే సూటిగా చెప్పింది. అవినాష్ ను అనేక సార్లు గంటల తరబడి ప్రశ్నించింది. వివేకా హత్య కేసులో సహ నిందితులుగా తండ్రి, తనయులలో తండ్రి భాస్కర్ రెడ్డిని అరెస్టు చేసి, సహ నిందితుడుగా ఉన్న అవినాష్ రెడ్డి అరెస్టు విషయంలో సీబీఐ దాగుడు మూతలు ఆడింది నిజం కాదా? అవినాష్ రెడ్డి అరెస్టు విషయంలో అడ్డంకులు లేకపోయినా సీబీఐ ఆ దిశగా అడుగులు వేయలేదు.

సీబీఐ లాంటి వ్యవస్థలు రాజ్యాంగ విలువలను కాపాడుతూ తమ స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. నిక్కచ్చిగా, నిజాయతీగా వ్యవహరించకపోతే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది. విచారణలు వేగంగా, నిష్పక్షపాతంగా జరగాలి. దోషులు ఎంతటి శక్తిమంతులైనా శిక్ష తప్పదన్న నమ్మకం ప్రజల్లో పునరుద్ధాటించాల్సిన అవసరం ఉంది. సీబీఐ తక్షణమే ఈ కేసును పునర్ విచారణ జరిపి కుట్రదారులను, దోషులను బోనులో నిలబెట్టి తమ విశ్వసనీయతను రుజువు చేసుకోవాలి.

**- మన్నవ సుబ్బారావు**

# ఘనంగా వీఎంఆర్డీఏ క్రీడా ఉత్సవం



విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్డీఏ) వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్కయ్యపాలెంలోని పోర్టు స్టేడియంలో శనివారం క్రీడా ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు పి.గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్‌లతో పాటు ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామల దీపిక, క్రెడాయ్ పూర్వ ఛైర్మన్ ధర్మేంద్ర, తదితరులు పాల్గొన్నారు. క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా పల్లా శ్రీనివాసరావు బౌలింగ్ చేయగా, వెలగపూడి, గణబాబు బ్యాటింగ్ చేశారు. అలాగే వీఎంఆర్డీఏ చైర్మన్, కమిషనర్ ఒకవైపు, ప్రజాప్రతినిధులు మరోవైపు ఉండి 'టగ్ ఆఫ్ వార్' ఆడగా వీఎంఆర్‌డీఏ గ్రూప్ గెలిచింది. ఇలాంటి క్రీడల వల్ల ఉద్యోగులకు మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్ ప్రతినిధి కాశీవిశ్వనాథం, సీఏవో హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# గీత కులాలకు ఊపిరి పోసిన నాయకుడు చంద్రబాబు

**● ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో కృతజ్ఞతా ర్యాలీ**

రాజమహేంద్రవరం (చైతన్యరథం): ఇచ్చిన మాట ప్రకారం గీత కులాలకు మద్యం షాపుల్లో 10 శాతం, బార్ల లైసెన్సుల్లో 10 శాతం కేటాయించిన సీం చంద్రబాబు, మంత్రి లోకేష్‌ల కృషి అభినందనీయమని ఏపీ శెట్టిబలిజ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు అన్నారు. "గీత కులాల ఆపద్బాంధవుడు మన చంద్రన్న" పేరిట శనివారం సాయంత్రం తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం నల్లజర్లలో తరలి వచ్చిన జన సందోహం మధ్య గీత కులాల కృతజ్ఞత పర్యటన నిర్వహించారు. ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో 100 కార్లతో సుమారు 500 మంది ఈ ర్యాలీలో పాల్గొన్నారు. కిక్కిరిసిన జన సందోహంతో ర్యాలీ ఆద్యంతం పండుగ వాతావరణాన్ని తలపించింది. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో గోపాల పురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కుడుపూడి సత్తిబాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఎస్సీ బీసీలను ఆదుకున్న ప్రభుత్వం ఒక్క తెదేపా ప్రభుత్వమే అన్నారు. గత జగన్ ప్రభుత్వంలో 23 ఎస్సీ పథకాలను తొలగించగా చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని పునరుద్ధరించారని గుర్తు చేశారు. నల్లజర్లలో నారా లోకేష్ పాదయాత్ర చేసిన సందర్భంలో ఇచ్చిన హామీకి కట్టుబడి గీత కులాలకు మద్యం షాపుల్లో 10 శాతం కేటాయించారని, అంతేకాక బార్ల లైసెన్సుల్లో కూడా 10 శాతం కేటాయించారని, లైసెన్సు ఫీజులో 50 శాతం రాయితీ ఇస్తూ సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం శెట్టి బలిజ, గౌడ, శ్రీశయన, యాత, ఈడిగ కులాల సామాజిక అభివృద్ధికి



ఎంతగానో ఊతమిస్తుందని చెప్పారు. ఈ కులాలు చంద్రబాబునాయుడుకు రుణపడి ఉంటాయని చెప్పారు. సభలో ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ముళ్ళపూడి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీలకు ప్రభుత్వం అండగా ఉంటుంది : మంత్రి కొండపల్లి



విజయనగరం రూరల్ (చైతన్యరథం): ఆదివాసీలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని, వారికి అండగా ఉంటుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గిరిజన ప్రాంతాలకు రహదారుల అభివృద్ధికి రూ. 10 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు ఇప్పటికే పంపించినట్లు చెప్పారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కొండపల్లికి గిరిజన సంప్రదాయాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మంత్రి కొండపల్లి మాట్లాడారు. జిల్లా విడిపోయిన తర్వాత ఐటీడీఏ మన జిల్లా నుంచి వేరు అయిందని.. గిరిజనులకు అందాల్సిన సౌకర్యాలను కోల్పోయామన్నారు. విడిపోవడం వల్ల ఏమేమి కోల్పోయామో.. వాటన్నింటినీ జిల్లాలో ఉన్న 36 గ్రామాలకు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమీక్షలు జరిపి గిరిజన సమస్యలను తెలుసుకోవాలని, తద్వారా పరిష్కారానికి కృషి చేయాలని గిరిజన సంక్షేమ శాఖ అధికారిని మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా గిరిజనుల నృత్యాలు అందరినీ అలరించాయి.

# రౌడీయిజం చేస్తే ఊరుకునే ప్రభుత్వం కాదు : కలమట



కొత్తూరు (చైతన్యరథం): రౌడీయిజం చేస్తామంటే కూటమి ప్రభుత్వం ఎవరి వదలిపెట్టదన్న విషయం వైసీపీ నాయకులు గుర్తెరిగి మెలగాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకట రమణమూర్తి అన్నారు. కొత్తూరు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. తిరుపతిలో భూమన కరుణాకర్ రెడ్డి కుమారుడు అభినయ్‌రెడ్డి కార్యాలయంలో వైసీపీ రౌడీలు ఒక దళిత యువకుడిని బంధించి చిదకబాది చిత్రహింసలకు గురిచేయడమే కాకుండా విడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టి భయపెట్టడం దారణమన్నారు. కర్లెమ్మ సర్పంచ్ ఎల్.భగవాన్‌దాస్‌నాయుడు, టీడీపీ నాయకులు చోడవరపు జోగినాయుడు, ఎద్దు శ్రీనివాసరావు, మడపాన రాజారావు, గండికోట త్రినాథరావు, మడపాన రాజారావు పాల్గొన్నారు.

**'చాలా సమస్యలు మౌనంతో పరిష్కారం అవుతాయి. కానీ, మనం మాటలతో ఆ అవకాశాన్ని చేజార్చుకుంటాం.' - మహాత్మాగాంధీ**

# గత ప్రభుత్వం గిరిజనుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది

**●గిరిజన యువతికి స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు**

**●ప్రపంచ ఆదివాసీదినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు**



పాతపట్నం (చైతన్యరథం): గిరిజనలు అభివృద్ధి చెందితే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీదినోత్సవ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 1982లో గిరిజనుల అభ్యున్నతి కోసం ఐటీడీఏ వ్యవస్థను ఏర్పాటు చేశారని అన్నారు. అప్పటి నుంచి గిరిజనులకు విద్య, వైద్య, మౌళిక సదుపాయాల కల్పనకు అధిక ప్రధాన్యత ఇచ్చారని అన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఏడాదిలో రాష్ట్రంలో గిరిజన ప్రాంతాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పనకు రూ.1000 కోట్ల మంజూరు చేయడం జరిగిందని అన్నారు. ఇప్పటికే రూ.230 కోట్ల రూపాయలు తాగునీరు సౌకర్యం కోసం నిధులు మంజూరు చేశామని అన్నారు. చిన్న తరహా పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నటు తెలిపారు.వాటితో పాటు పరిసర ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. గిరిజన యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని అన్నారు, ఉపాధి అవకాశాలు పొందేందుకు అవసరమైన శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ప్రత్యేకంగా నైపుణ్య శిక్షణ కేంద్ర ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమాన్ని సమాంతరంగా తీసుకు వెలుతున్నామని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం హామీలన్ని అమలు చేశామని, తల్లికివందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు గ్యాస్‌సిలెండర్, పింఛన్ల పెంపు, అమలు చేశామని అన్నారు. ఈ నెల 15న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఒక్క పింఛన్లుకు రూ.32వేల కోట్లు ఖర్చు అవుతుందని అన్నారు. గిరిజన గ్రామాలకు ఇప్పటికే 200 యూనిట్లు విద్యుత్ ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. రానున్న రెండు సంవత్సరాల్లో అన్ని గిరిజన గ్రామాల్లో అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. ఫోన్లు సిగ్నల్ వ్యవస్థను మెరుగు పరిచేందుకు ఇప్పటికే రూ. 4కోట్లతో బీఎస్ఎన్ఎల్ టవర్లు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఉపాధి అవకాశాలు పొందేందుకు 2014-2019 సంవత్సరంలో రుణాలు మంజూరు చేశామని గత ప్రభుత్వం వాటిని రద్దు చేసిందని విమర్శించారు.

## ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్



కురుపాం (చైతన్యరథం): గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో ఉన్న యూత్ ట్రైనింగ్ సెంటర్ ప్రాంగణంలో మండలంలోని వివిధ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో శనివారం నాడు 'ప్రపంచ ఆదివాసీ దినోత్సవం' ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి హాజరయ్యారు. గిరిజనులంతా ఏకమై ఒక పండగలా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం పలు పాఠశాలల విద్యార్థినిలతో థింసా నృత్యం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన హక్కులు కాపాడుకోవాలని, ఆచార వ్యవహారాలు ముందుకు తీసుకువెళ్లాలని, గిరిజనులందరూ కూడా ఐక్యతతో ఉండి హక్కులు సాధించుకోవాలని, అడవి తల్లిని పూజించడం అంటే ప్రకృతిని కాపాడుకోవడమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గిరిజన సంఘాల నాయకులు, గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సంహాచలం స్వామి వారి ఆభరణాలు తనిఖీ

విశాఖ: సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆభరణాలను ఫైవ్‌మాన్ కమిటీ సభ్యులు తనిఖీలు చేస్తున్నారు. గత ఏడాది కడప ప్రాంతానికి చెందిన ప్రభాకరాచారి అప్పన్న భక్తులు సమర్పించిన రజిత, స్వర్ణ ఆభరణాల తూనికల్లో తేడాలున్నాయని, కొన్ని ఆభరణాలు మాయమయ్యాయని, వాటి నిజాలు నిగ్గు తేల్చాలని దేవదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ కె.సుబ్బారావు విచారణకు ఆదేశించారు.ఈ మేరకు ఫైవ్‌మాన్ కమిటీ శనివారం ఆభరణాలు తనిఖీలు చేపట్టారు.

# గీత కార్మికుల శ్రేయస్సు కోసం కూటమి ప్రభుత్వం నిరంతర కృషి

- కాకినాడ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు వెల్లడి




కాకినాడ (చైతన్యరథం): గీత కార్మికుల శ్రేయస్సు కోసం కూటమి ప్రభుత్వం నిరంతర కృషి చేస్తుందని మద్యం పాలసీలో గీత కార్మికులకు 10% అమలు చేసి వారి ఆర్థిక అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. గీత కార్మికులకు మద్యం పాలసీలో 10% కేటాయించడంపై కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ శనివారం సభ్యులు స్వగృహం జగన్నాధపురం నందు కాకినాడ నగర శెట్టిబలిజ – గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ... కష్టాన్ని నమ్ముకొని జీవనం సాగిస్తున్న వారిలో గౌడలు గీత ముందంజలో ఉంటారని, రాష్ట్రంలో 3,534 కల్లు గీత సహకార సమాఖ్యల్లో 1.06 లక్షల మంది కల్లుగీత కార్మికులు ఉన్నారని, వీరికి ఆర్థికంగా చేయూతనివ్వడం కోసం ప్రత్యేక ఫెడరేషన్ను ఏర్పాటు చేసిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికే చెందుతుందని, 2018–19 లో కల్లుగీత కార్మికులకు ఆర్థిక చేయూత కోసం టీడీపీ ప్రభుత్వం రూ.70 కోట్ల బడ్జెట్ కేటాయించిందిని, 15 మంది సభ్యులతో గ్రూప్ ఏర్పాటు చేసి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి 50శాతం సబ్సిడీతో రూ.30 లక్షల వరకు రుణాలిచ్చి సొంత కాళ్లపై నిలబడేలా చేసిందిని, 50 సంవత్సరాలు దాటిన గీత కార్మికుడికి రూ.2 వేల పింఛన్ అందించిందిని, ప్రతి ఐదేళ్లకోసారి కల్లు పాలసీని పునరుద్దరించేలా ఏర్పాటు చేయడంతో రాష్ట్రంలోని 1.06 లక్షల గీత కార్మికులకు ఏటా రూ.3.43 కోట్ల లబ్ది కలుగుతోందిని, కల్లు తీసే సమయంలో చెట్టు మీద నుంచి పడి గాయపడి అంగవైకల్యం ఏర్పడిన గీత కార్మికులకు వయస్సుతో నిమిత్తం లేకుండా వికలాంగులకు అందజేసే విధంగా పెన్షన్ అందించడం జరుగుతుందని, గీత కర్మికుడు చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.5 లక్షల మేర బీమా అందించడం జరుగుతుందని, జాతీయ ఉపాధి హామీ పథకం కింద చెరువులు, కాలువల గట్ల మీద తాటి, ఈత చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించి ఉపాధి అవకాశాలు మెరుగుపడదేలా చేయడం జరిగిందని, ఆదరణ పథం కింద గీత కార్మికులకు ద్విచక్ర వాహనాలతో పాటు చెట్లు ఎక్కడానికి యంత్రాలను అందించడం జరిగిందని, గత వైసీపీ ప్రభుత్వం గీత కార్మికులను నమ్మించి ద్రోహం చేసిందని కల్లుగీత పాలసీని జీఓ.నెం.693 ద్వారా గీత కార్మికులను అణచివేసేలా జగన్ రెడ్డి ప్రభుత్వం వ్యవహరించిందిని, నూతన కల్లుగీత పాలసీ పేరుతో గీత కార్మికులను అణచివేసేలా వ్యవహరించిందని పేర్కొన్నారు.

# 'డిజి లక్ష్మి' పేరుతో కియోస్క్ సెంటర్లు

- ప్రజలకు డిజిటల్ సేవలు అందించేందుకు... మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు

పట్టణ స్వయం సహాయ సంఘాల సభ్యుల్లో డిగ్రీ చదివిన మహిళలకు ఉపాధి కల్పించడంతో పాటు ప్రజలకు డిజిటల్ సేవలు అందించే లక్ష్యంతో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) 'డిజి లక్ష్మి' కార్యక్రమాన్ని రూపొందించింది. సీఎస్ఈ ఈ–గవర్నెన్స్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ తోడ్పాటుతో స్లమ్ లెవల్ సమాఖ్య (ఎస్ఎల్ఎఫ్) పరిధిలో ఒక కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్సీ) నెలకొల్పుతారు. వీటిలో మీసేవ కేంద్రాల్లో అందించే అన్ని రకాల ప్రభుత్వ డిజిటల్ సేవలు అందిస్తారు. త్వరలోనే ప్రారంభించనున్న వీటి ద్వారా పౌర సేవలు సులభం కావడంతో పాటు మహిళలకు స్వయం ఉపాధి లభించనుంది.

**'డిజి లక్ష్మి' పేరుతో కియోస్క్ సెంటర్లు** : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వ్యాపార లైసెన్సులు, రేషన్ కార్డు కోసం దరఖాస్తులు, ఇలా ప్రతి పనికీ డిజిటల్ సేవలు అవసరం అవుతున్నాయి. పట్టణ పేదలకు ఈ సేవలను చేరువ చేసేందుకు ప్రభుత్వం 'డిజి లక్ష్మి' పేరుతో కియోస్క్ సెంటర్లను ఏర్పాటు చేస్తోంది. ఒక్కో కేంద్రంలో డిగ్రీ చదివిన మహిళతో పాటు మరో ఇద్దరు అతివలకు ఉపాధి లభించనుంది.

త్వరలో ప్రారంభించనున్న కియోస్క్ సెంటర్లలో ప్రాథమికంగా 20 సేవలు అందనున్నాయి. దశల వారీగా వీటి సంఖ్య పెరగనుంది. ఆస్తిపన్ను, తాగునీటి రుసుములు, ప్రజల నుంచి వసూలు చేసే పన్నులను ఈ సెంటర్ల ద్వారా చెల్లించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# పామర్రులో ఎయిమ్స్ శాటిలైట్ కేంద్రాన్ని నెలకొల్పండి

- మంగళగిరి ఎయిమ్స్ వారిని కోరిన ఎంపి బాలశౌరి




పామర్రు (చైతన్యరథం): ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని ప్రతిష్టాత్మకమైన మంగళగిరి ఎయిమ్స్ యొక్క 11వ గవర్నింగ్ బాడీ సమావేశంలో ఎంపి బాలశౌరి పాల్గొన్నారు. 11వ గవర్నింగ్ బాడీ సమావేశంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, డైరెక్టర్ శాంతా సింగ్ మరియు ఇతర సభ్యులతో కలిసి పాల్గొన్నారు. హైబ్రిడ్ పద్ధతిలో జరిగిన ఈ సమావేశంలో కొంతమంది సభ్యులు ఆన్‌లైన్‌లో జాయిన్ కావడం జరిగింది. సమావేశంలో ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ... ప్రతిరోజూ ఎక్కువ మంది రోగులు ఎయిమ్స్‌కు వస్తున్నందున, పడకలు అవసరం ఎక్కువగా ఉందని, అందుకోసం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కిడ్నీ సంబందిత సమస్యలతో ఎక్కువ మంది పేషెంట్‌లు వస్తున్నందున, వారికీ అవసరమైన డయాలసిస్ పరికరాలు అందుబాటులో ఉంచాలని, ఆసుపత్రిలో పరికరాలు తగ్గితే తెప్పించాలని ఎయిమ్స్ డైరెక్టర్‌ను కోరారు. కృష్ణా జిల్లాలోని పామర్రు నియోజకవర్గం నందు ఎయిమ్స్ వారి శాటిలైట్ కేంద్రాన్ని నెలకొల్పాలని, అందువలన గ్రామీణ ప్రాంతాలలోని రోగులకు అవసరమైన వైద్య సేవలు అందుతాయని తెలిపారు. ఇందుకోసం అవసరమైన ప్రతిపాదనలు తయారుచేయాలని ఎయిమ్స్ డైరెక్టర్‌ని కోరారు. అంతేకాకుండా రోగుల పట్ల శ్రద్ధ వహించడానికి అవసరమైన స్థాయిలో డాక్టర్‌లు, ఇతర సిబ్బంది ఉండాలని, లేని పక్షంలో సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు. అన్ని ప్రాంతాల నుండి రోగులు రావడానికి వీలుగా మంగళగిరి ఎయిమ్స్ దగ్గరలోని రైల్వే స్టేషన్‌లో హాల్ట్ ఇవ్వాలని రైల్వే మంత్రిని కోరతామని తెలిపారు. మంగళగిరి ఎయిమ్స్ నేషనల్ హై వే 16 పక్కనే ఉన్నందున, రోడ్డు ప్రమాద బాధితుల కోసం అత్యవసర ట్రామా విభాగం నెలకొల్పాలని, అందువలన రోడ్డు ప్రమాద బాధితులకు వెంటనే సరైన వైద్యం అందే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ఎయిమ్స్ డైరెక్టర్ శాంతా సింగ్, విజయవాడ ఎంపి కేసినేని శివనాథ్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ ఓ ఆర్థిక భరోసా : తంగిరాల

- 58 మంది లబ్ధిదారులకు రూ.36 లక్షల చెక్కులు అందజేత



నందిగామ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తన కార్యాలయంలో కూటమి నేతలతో కలిసి సీఎం సహాయ నిధి చెక్కులను 58 మంది లబ్ధిదారులకు 36,07,979 రూపాయల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమం నందిగామ నియోజకవర్గంలోని ప్రజలకు ఆర్థిక సహాయం అందించడంలో ప్రభుత్వం చూపిస్తున్న నిబద్ధతకు నిదర్శనంగా నిలిచింది. సీఎం సహాయ నిధి పథకం ద్వారా, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వ్యక్తులకు వైద్యం, విద్య మరియు ఇతర అత్యవసర అవసరాల కోసం ఆర్థిక సహాయం అందించబడుతుంది. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేదలకు ఒక వరం వంటిది. ఈ పథకం ద్వారా నందిగామ నియోజకవర్గంలోని అర్హులైన లబ్ధిదారులకు సహాయం అందించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే మా లక్ష్యం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

సంతబొమ్మాళి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం నేతన్నలకు రూ.25వేలు ఆర్థికసాయం ప్రకటించడంపై సంతబొమ్మాళి గ్రామంలో పద్మశాలీయులు హర్షం వ్యక్తం చేశారు. అంతరించిపోతున్న చేనేత కళను ప్రోత్సహించేలా కార్మికుల కష్టాలను తీర్చాలని ప్రోత్సహిస్తున్న కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ సీఎం చంద్రబాబు చిత్రపటాలకు శనివారం పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ పద్మశాలి సంఘం డైరెక్టర్ కూచెట్టి కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

# గీత కార్మికులకు అండగా కూటమి ప్రభుత్వం

- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటానికి నాయకులు పాలాభిషేకం



మచిలీపట్నం (చైతన్యరథం): గీతకార్మికులకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని, కల్లు గీత కార్మికుల ఆర్థికాభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని మచిలీపట్నం ఎంపి వల్లభనేని బాలశౌరి, పామర్రు ఎమ్మెల్యే వరకుమార్ రాజా, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తిలు పేర్కొన్నారు. కల్లుగీత కార్మికులకు మొన్న 10 శాతం అంటే 340 మద్యం షాపులు, తాజాగా ప్రభుత్వం అమలు చేయనున్న బార్ పాలసీలో 10శాతం బార్లు గీత కార్మికులకు కేటాయించటంపట్ల ఎంపి వల్లభనేని బాలశౌరి, పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తిలు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్లకు కృతజ్ఞతలు తెలియజేస్తూ శనివారం మండల కేంద్రం తోట్లవల్లూరులో సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపి వల్లభనేని బాలశౌరి, పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తిలు మాట్లాడుతూ.. కల్లు గీత కార్మికులకు గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తాజాగా ప్రకటించిన నూతన బార్ పాలసీలో పది శాతం గీతకార్మికులకు ఇవ్వాలనే నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వానికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. గతంలో మద్యం షాపుల్లో కూడా పది శాతం వాటా కేటాయించి గీత కార్మికులకు అండగా నిలిచారని, ఇది మింగుడుపడని వైసీపీ తన కరపత్రం (సాక్షి)లో అన్ని అబద్దాలు రాయిస్తున్నారని, దుర్మార్గపు విషపు రాతలు రాయిస్తున్నారని మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ స్థాపించాక స్థానిక సంస్థల ఎన్నికల్లో 20% బీసీలకు రిజర్వేషన్ ఇచ్చి అండగా నిలిచిందని, ఆ 20% ను చంద్రబాబు అధికారంలోకి వచ్చాక 33% శాతానికి పెంచారని, రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా వచ్చిన 10 శాతం రిజర్వేషన్ పదవులను జగన్ పీకేసి నేడు దుర్మార్గపు రాతలు రాయించడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు విద్యలో తీసుకు వచ్చిన సంస్కరణలవలనే బీసీ జాతులు చదువుకొని నేడు ఉన్నత స్థానాల్లో రాణిస్తున్నారు. గతఐదు సంవత్సరాల్లో కల్లు గీత కార్మిలు తాడి చెట్ల నుండి పడి ప్రమాదాలకు గురైతే వైకాపా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, 2014 – 2019 మధ్య కల్లు గీత కార్మికులు తాడి చెట్ల నుండి ప్రమాదానికి గురైతే చంద్రన్న బీమా కింద ఆదుకున్నామని, ప్రమాదాలకు గురై ఎవరైనా అంగవైకల్యం పొందితే వయసుతో సంబంధం లేకుండా పింఛన్ ఇచ్చామని, కల్లు గీత కార్మికులకు 50 సంవత్సరాలికే పింఛన్ పథకాన్ని తెచ్చామన్నారు. గీత కార్మికులకోసం ఆధరణ పథకాన్ని తీసుకువచ్చి.. పదివేల రూపాయల నగదుతోపాటు లక్ష మందికి సైకిళ్లుఅందించాం. అంతే కాకుండా.. బడ్జెట్ గ్రూప్ రుణాలు, వ్యక్తిగత రుణాలు రూ. 210 కోట్లు కార్పొరేషన్ ద్వారా అందించామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి పార్టీల నాయకులు, కార్యర్తలు పాల్గొన్నారు.

# గిరిజనుల అభివృద్ధికి నిబద్ధతతో కృషి : పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు (చైతన్యరథం): రాష్ట్రంలో గిరిజనుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిబద్ధతతో కృషి చేస్తున్నాయని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గిరిజనుల అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమన్వయంతో పని చేస్తున్నారన్నారు. అల్లూరి సీతారామరాజు, బి.ఆర్. అంబేద్కర్, ఏకలవ్యుడు, వెన్నెలకంటి రాఘవయ్య, చెంచులక్ష్మిని స్ఫూర్తిగా తీసుకుని గిరిజనులు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, అధికారులు, గిరిజన సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# హజ్ యాత్రికులకు ఆర్థికసాయం విడుదలపై మైనారిటీ నాయకుల హర్షం

● సీఎం చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలిపిన మైనార్టీ నాయకులు



మంగళగిరి (చైతన్యరథం): హజ్ యాత్రికులకు ఆర్థికసాయం విడుదలపై మైనారిటీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు, దుగ్గిరాల ఎంపీపీ షేక్ జబీన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మరో ఎన్నికల హామీని నెరవేర్చిందని అన్నారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 2025-హజ్‌యాత్రకు వెళ్లి సఫలం చేసుకొని వచ్చిన 72 మంది యాత్రికుల వ్యక్తిగత ఖాతాల్లోకి ఈ నెల 06 తేదీన నేరుగా ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున మొత్తం రూ. 72 లక్షలు జమ చేయడం జరిగిందన్నారు. మంజూరు చేసిన 24 గంటల వ్యవధిలోనే నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి నగదును ప్రభుత్వం జమ చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి వాజ్ యాత్రికులకు ఆర్థిక సహాయం విడుదల చేయడం జరిగిందని పేర్కొన్నారు. అలాగే 2026వ సంవత్సరంలో కూడా విజయవాడ ఎంబార్కేషన్ పాయింటు నుండి బయలుదేరు హజ్ యాత్రికులు ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున కూటమి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి అత్యధిక సంఖ్యలో విజయవాడ ఎంబార్కేషన్ పాయింటు నుండి హజ్ యాత్రకు బయలుదేరి రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ. లక్ష రూపాయల ఆర్థిక సహాయం లబ్ధి పొందాలని కోరారు.

# కోలాహలంగా టీడీపీ నూతన కార్యాలయం ప్రారంభం

●గుంటూరు 21వ డివిజన్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గళ్లా మాధవి



గుంటూరు (చైతన్యరథం): పశ్చిమ నియోజకవర్గంలోని 21వ డివిజన్‌లో తెలుగుదేశం పార్టీ నూతన కార్యాలయం కోలాహలంగా ప్రారంభమైంది. డివిజన్ అధ్యక్షుడు మస్తాన్ వలి (నన్నే) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని ఎమ్మెల్యే గళ్లా మాధవి ముఖ్య అతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ, "ఈ కార్యాలయం కేవలం ఒక భవనం కాదు. ఇది ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితమైన సేవా కేంద్రం. ప్రతి కార్యకర్త, ప్రతి అభిమాని ఇక్కడి నుంచి ప్రజల కష్టాలను ఆలకించి, వాటికి పరిష్కారం చూపేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తారు" అని అన్నారు. గత పదేళ్లుగా అభివృద్ధికి దూరమైన ఈ ప్రాంతానికి ఇప్పుడు తాము అండగా ఉంటామని, ప్రజల కోసం, అభివృద్ధి కోసం, పారదర్శక పాలన కోసం కృషి చేస్తామని ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. ఈ డివిజన్‌లో మురుగునీటి కాల్వల శుభ్రత, కొత్త పైపులైన్ల ఏర్పాటు ద్వారా మంచి నీటి పారుదల సమస్యలకు శాశ్వత పరిష్కారం, వీధి దీపాలు, ఆధునిక లైట్ల ఏర్పాటుతో రాత్రివేళల్లో గంజాయి బ్యాచ్ ఆగడాలు తగ్గించగలిగాము. పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించామని, ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు వెనక్కి తగ్గబోమని, గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తామని హామీ ఇచ్చారు.

# గుంటూరులో చారిత్రాత్మకమైన అభివృద్ధికి శ్రీకారం చుట్టాం

● 52 డివిజన్‌లో పర్యటించిన ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (చైతన్యరథం): తూర్పు నియోజకవర్గంలో ప్రజానాయకుడు ఎమ్మెల్యే నసీర్‌కి తోడుగా ప్రజానీకం కదులుతున్నారు. సుపరిపాలన -తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం 52వ డివిజన్లో ఎమ్మెల్యే నసీర్ పర్యటించారు. తమ ప్రాంతానికి తరలివచ్చిన ఎమ్మెల్యేకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ప్రజల కోసం పని చేసే నాయకులకు ప్రజా ఆశీర్వాదం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. గుంటూరు నగరంలో ఏడాదిలో చరిత్రాత్మకమైన అభివృద్ధికి శ్రీకారం చుట్టామని తెలిపారు. శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణానికి పునాదులు పడ్డాయని, ఇది ఈ ప్రాంత ప్రజలకు వరమని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో గుంటూరు నగర అభివృద్ధి తలమానికంగా నిలుస్తోందని చెప్పారు. రైల్వే ప్రాజెక్టుల నిర్మాణంతో ముంపు ప్రాంత వాసుల కష్టాలు తీరబోతున్నాయని తెలిపారు. ఇది నిబద్ధత, చిత్తశుద్ధి గల నాయకుల కృషి వల్లే సాధ్యమవుతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# పులివెందులలోని రౌడీ.. రాక్షస రాజ్యాన్ని ప్రజలు తరిమికొట్టబోతున్నారు : ప్రత్తిపాటి

●ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉపఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే



చిలకలూరిపేట / పులివెందుల (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వం.. పనితీరుపై ప్రజలకున్న నమ్మకమే కూటమి పార్టీలకు విజయాన్ని సాధించి పెడుతుందని, ఏ ఎన్నికైనా ప్రజలు తమకోసం పనిచేసే నాయకత్వాన్నే గెలిపిస్తారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉపఎన్నిక సందర్భంగా శనివారం ఆయన కూటమిపార్టీల అభ్యర్థి అద్దలూరి ముద్దుకృష్ణారెడ్డి తరుపున, మంత్రి ఎన్.ఎం.డీ ఫరూక్, శాప్ ఛైర్మన్ రవినాయుడుతో కలిసి రెండోరోజు స్థానికంగా విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రజలు కూటమిప్రభుత్వ పక్షాన నిలిస్తేనే, రాష్ట్రంలో దోపిడీదారులకు స్థానం ఉండదు. గ్రామాల్లో ప్రచారం చేపట్టిన నేతలు.. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచి చంద్రబాబు నాయకత్వంలో ఏడాదిలో జరిగిన మంచిని.. చేస్తున్న అభివృద్ధిని వివరించారు. తమ సంక్షేమం.. సంతోషం కోసం పనిచేసే కూటమి ప్రభుత్వం పక్షానే ప్రజలు నిలవాలని.. అప్పుడే రాష్ట్రంలో దుర్మార్గులు, దోపిడీదారులకు స్థానం లేకుండాపోతుందని తెలియచేశారు. ప్రచారంలో భాగంగా మాజీమంత్రి ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడారు.

**రెండు ఉపఎన్నికల్లో విజయం కూటమి అభ్యర్థులదే**

జగన్మోహన్‌రెడ్డి దుర్మార్గ పాలనతో విసిగిపోయిన ప్రజలు, రౌడీరాజ్యాన్ని అంగీకరించడానికి సిద్ధంగా లేరన్న ప్రత్తిపాటి.. పులివెందులలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగితే వైసీపీ గెలవదన్నారు. పులివెందులలో సాగుతున్న రౌడీ.. రాక్షస రాజ్యాన్ని తరిమికొట్టడానికి ప్రజలు సిద్ధమయ్యారన్నారు.

**ప్రజాసంక్షేమం... పరిమితుల్లేని అభివృద్ధిలో చంద్రబాబు దేశానికే రోల్ మోడల్**

ప్రజలు మెచ్చేలా.. వారికి నచ్చేలా సంక్షేమపథకాలు అమలుచేయడంలో గానీ.. పరిమితులు లేని అభివృద్ధిలో గానీ చంద్రబాబు దేశానికే రోల్ మోడల్‌గా నిలిచారని ప్రత్తిపాటి చెప్పారు.

**నాడు ఎన్టీఆర్ కూడు.. గుడ్డ..నీడ.. నేడు చంద్రబాబు సూపర్-6 పథకాలు దేశానికే మార్గదర్శకాలు**

టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ గతంలో పేదవర్గాలకు కూడు..గుడ్డ...నీడ అందించాలన్న సదుద్దేశంతో మంచి పథకాలు ప్రవేశపెట్టి, దేశానికే సరికొత్త సంక్షేమ పంథాను చూపారని ప్రత్తిపాటి కొనియాడారు.

# టీడీపీ హయంలోనే విజయవాడ అభివృద్ధి

●పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఎంపీ కేశినేని శివనాథ్



విజయవాడ (చైతన్యరథం): గత టీడీపీ హయంలోనే విజయవాడ నగరం అభివృద్ధి జరిగిందని, ఇప్పుడు కూడా కూటమి ప్రభుత్వ హయంలోనే విజయవాడ నగరం అభివృద్ధి చేస్తున్నామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. శనివారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 4వ డివిజన్‌లోని తిమ్మరుసు వారు వీధిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హాజరై ప్రతి ఇంటికి వెళ్ళి ఏడాది కూటమి ప్రభుత్వ హయంలో అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం డివిజన్‌లో రూ.కోటి ఏడు లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులకు ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామమోహన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వ హయంలో రోడ్ల నిర్మాణ గురించి పట్టించుకోలేదన్నారు. అందువల్ల రహదారులు అన్నీ గుంతలు పడ్డాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రహదారుల నిర్మాణ పనులను చేపట్టామన్నారు. ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని రహదారులను నిర్మాణం చేస్తున్నామని చెప్పారు. మెట్రో నిర్మాణంతో పాటుగా నగరంలో ఫ్లైఓవర్ నిర్మాణం చేయనున్నామని చెప్పారు. పున్నమిఘాట్ వరకు హైవేఎక్స్‌ప్రెస్‌ను అభివృద్ధి చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ... విజయవాడ నగరం చుట్టు పక్కల ఉన్న అన్ని రహదారులను పునర్నిర్మాణం చేస్తున్నామన్నారు. పంట కాలువ రోడ్డు, మహానాడు రోడ్డు, టవర్‌లైన్ రోడ్డు ఇలా అన్ని టీడీపీ హయంలోనే నిర్మాణం చేశామన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేగా తాను విజయవాడ చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల్లో నుంచి నగరానికి రావడానికి అన్ని రహదారులను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ప్రధానమైన రహదారులను ప్రత్యేకమైన నిధులతో అభివృద్ధి చేస్తున్నామన్నారు.

# పేద పిల్లలందరికీ విద్యనే ఆస్తిగా అందిస్తాం



**మునిసిపల్ మంత్రి డాక్టర్ నారాయణ వెల్లడి**

నెల్లూరు, (చైతన్యరథం): కార్పొరేషన్ పరిధిలోని 11 ప్రభుత్వ హై స్కూళ్లను వచ్చే విద్యా సంవత్సరంలో అన్ని హంగులతో సిద్ధం చేస్తామని రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ వెల్లడించారు. మూలాపేట్రలోని బాలికల ఉన్నత పాఠశాల వీఆర్సీ, ఆర్ఎస్ఆర్ పాఠశాలను మంత్రి నారాయణ పరిశీలించారు. వీఆర్సీ తరహాలోనే పాఠశాలలన్నింటినీ మారుస్తానని మంత్రి నారాయణ తెలిపారు. ముందుగా మూలపేట బాలిక ఉన్నత పాఠశాల సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా ఆధునీకరణ పనులను చేపట్టిన డీఎస్ఆర్ కన్స్ట్రక్షన్ అధినేత సుధాకర్ రెడ్డితో మాట్లాడారు. శరవేగంగా జరుగుతున్న పనులను పరిశీలించారు. నూతన భవన నిర్మాణాలపై అధికారులకు పలు సూచనలిచ్చారు. అనంతరం వీఆర్సీ పాఠశాలలో కార్పొరేషన్, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులతో మంత్రి నారాయణ సమీక్ష సమావేశం నిర్వహించారు. పాఠశాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని మంత్రి తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు పేరెంట్స్ అభిప్రాయాలు తీసుకుని ముందుకెళ్లాలని దిశ నిర్దేశం చేశారు. ఎంపీ వీపీఆర్ దత్తత తీసుకున్న ఆర్ఎస్ఆర్ స్కూల్‌ని ఆధునీకరణకు సిద్ధం చేసిన డిజైన్‌ను మంత్రి పరిశీలించారు.. అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు 2014 – 19 లో వీఆర్ హైస్కూల్లో ఇంటర్ విద్యార్థులకు కాంపిటేటివ్ పరీక్షలకు శిక్షణ ఇచ్చామని, జిల్లా విద్యార్థులకు 50 శాతం, ఇతర జిల్లాలకు 50 శాతం అవకాశమిచ్చామన్నారు. ఖర్చును కార్పొరేషన్ భరించిందన్నారు. నెలకి ఆరు లక్షల రూపాయలు టీచర్ల జీతాలకు నారాయణ గ్రూప్ చెల్లించిందని, మంచి ఫలితాలు వచ్చాయని తెలిపారు. ఐఐటీ, ఎన్ఐటీ, మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థులతో అప్పటి మేయర్ అజీజ్ ర్యాలీ కూడా నిర్వహించారని గుర్తు చేశారు. తమ మీద కోపంతో వైఎస్సార్సీపీ ప్రభుత్వం దాన్ని మూసేసిందని మండిపడ్డారు. దానిని పునః ప్రారంభిస్తానని ఎన్నికల్లో మాట ఇచ్చామని, అంతర్జాతీయ ప్రమాణాలతో సిద్ధం చేసి మాట నిలబెట్టుకున్నామని చెప్పారు. పేదపిల్లలకు కార్పొరేట్ విద్యను అందుబాటులోకి తెచ్చామన్నారు. పీ4 కార్యక్రమం ద్వారా అన్ని స్కూళ్లను ఆధునీకరిస్తామన్నారు. పేదపిల్లలకు విద్యనే ఆస్తిగా అందిస్తామని ప్రకటించారు. వేలాదిమంది నిరుపేద పిల్లలకు కార్పొరేట్ తరహా విద్యను ఉచితంగా అందించటమే లక్ష్యమన్నారు. ఐదేళ్లలో కార్పొరేషన్ పరిధిలోని అన్ని స్కూళ్ళ రూపురేఖలు మారుస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్, డిప్యూటీ మేయర్ కుమార్ యాదవ్ , డీఈఓ బాలాజీరావు మాజీ జెడ్పీటీసీ విజేత రెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు మామిడాల మధు, డివిజన్ కో క్లస్టర్ డాక్టర్ పోకలరవి, వైస్ ప్రెసిడెంట్ చిరంజీవి, యూనిట్ ఇంచార్జి మహేష్, డిఎస్సార్ కంస్ట్రక్షన్స్ ఎండీ అనీల్ రెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ అన్నంగి ప్రసాద్, టీడీపీ ముఖ్యనేతలు పాల్గొన్నారు.



# పులివెందుల జగన్ అడ్డా కాదు

**గర్జించిన నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి**

నంద్యాల, (చైతన్యరథం): 'పులివెందుల జగన్ అడ్డా కాదు.. తెదేపా కంచుకోట కాబోతోంది' అని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. తెదేపా కుటుంబ సభ్యులంతా జడ్పీటీసీ ఎన్నికల్లో కలిసి పాల్గొంటున్నారని. తెలిపారు, కడప, పులివెందులకు ఐదేళ్లలో జగన్ ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. " కడప స్టీల్ ప్లాంట్ అన్నారు. ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. కేంద్ర ప్రభుత్వం కొప్పర్తికి రూ. 1,500 కోట్లు ఇచ్చింది. ఆ నిధులను దారి మళ్లించారు. వైకాపా ఐదేళ్ల పాలనలో దోచుకోవడంతోనే సరిపోయింది. పల్లె పల్లెకు 'సాక్షి'వారిని దించారు. ఏదైనా జరిగితే తెదేపాపై నెపం పెట్టాలని కుట్ర చేశారు. వైకాపా కుట్రలను ఈసీ దృష్టికి తీసుకెళ్తాం. పులివెందుల జడ్పీటీసీ ఉపఎన్నికలో తెదేపా అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి విజయం ఖాయం." అని శబరి ధీమా వ్యక్తం చేశారు.

# దోర్నాల ఘటన దురదృష్టకరం

**మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎరిక్షన్ బాబు, తన వంతుగా లక్ష రూపాయల ఆర్థికసాయం**

యర్రగొండపాలెం, (చైతన్యరథం): పెద్దదోర్నాల మండలం జమ్మిదోర్నాల గ్రామంలో ఈతకు వెళ్ళిన ఘటనలో విద్యార్థులు అద్భుత్ కుమార్, పవన్ ల మృతి విషయం తెలుసుకొని మార్కాపురం ప్రభుత్వ వైద్యశాల వద్ద వారి భౌతికకాయాలను యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు సందర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఇరు కుటుంబాలకు చెరో 50,000 రూపాయల చొప్పున లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ దుర్ఘటన విషయాన్ని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మాత్యులు డోలా బాల వీరాంజనేయ స్వామి కలెక్టర్ తమీమ్ అన్సారీయా దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం నుండి వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని ఎరిక్షన్ బాబు భరోసా ఇచ్చారు.



# అమరజీవికి అరుదైన గౌరవం

**కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన ఆర్యవైశ్య సంఘాలు**

నెల్లూరు, (చైతన్యరథం): అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు ఆత్మ త్యాగానికి గుర్తుగా రాజధాని అమరావతి లోని శాఖమూరు పార్కులో 6.8 ఎకరాల భూమిని అమరజీవి స్మృతి వనాన్ని ఏర్పాటుకు, 58 అడుగుల విగ్రహాన్ని నెలకొల్పడానికి అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్‌కి భూమిని కేటాయించడం దేశంలోనే ఒక చరిత్రగా నిలిచిపోతుందని టీడీపీ వాణిజ్య విభాగం ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని ముందుకు నడిపించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంత్రి నారా లోకేష్, పవన్ కళ్యాణ్, ముఖ్యంగా మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణకు, రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్‌కు నెల్లూరు పార్లమెంట్ తెలుగు వాణిజ్య విభాగం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా నెల్లూరు నగరంలో పెద్ద బజార్ సెంటర్ వ్యాపారులు, పొట్టి శ్రీరాములు అభిమానులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాజధానిలో సీఆర్డీఏ పరిధిలో 6.8 సెంట్లు భూమిని సేకరించి, అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డూండి రాకేష్‌కు అందజేసిన మంత్రి పొంగూరు నారాయణకు ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు.



# దళితులకు జగన్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి

**టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ డిమాండ్**

అమరావతి, (చైతన్యరథం): జగన్మోహన్ రెడ్డి మానవత్వం మరిచి మొన్న తన కాన్వాయ్ ఢీకొని వృద్ధ దళితుడు సింగయ్యను ప్రాణాలు కోల్పోయేలా చేసి ఆ విషాదం ఘటనను దాచిపెట్టేందుకు వేసిన కుప్పి గంతులు వైసీపీ ఆడిన ఆ బొంకు రాజకీయాన్ని రాష్ట్ర ప్రజలందరూ కళ్ళారా చూశారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ విమర్శించారు అమరావతిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆ సమయంలో కూడా మా కార్యకర్తని మేమే చంపుకున్నా.. ఏమైంది ? అని నిస్సిగ్గుగా మాట్లాడటం దళితుల ప్రాణాలకు గౌరవానికి వైసీపీ పార్టీ ఎంత విలువ ఇస్తుందో స్పష్టంగా అర్థం చేసుకోవచ్చని ఆయన విమర్శించారు. అదే ధోరణి నిన్న తిరుపతిలో మళ్లీ బయటపడిందని భూమన కరుణాకర్ రెడ్డి అనుచరులు అనిల్ రెడ్డి, దినేష్ రెడ్డి మరొక వ్యక్తి ముగ్గురు కలిసి ఒక దళిత యువకుడ్ని రూములో బంధించి క్రూరంగా దాడి చేసి కొట్టి హింసించారని ఆయన ఆరోపించారు స్పృహ కోల్పోయే అమానుషంగా దాడి చేయడమే గాక అతని కొడుతున్నప్పుడు వీడియోలు చిత్రీకరించి బాధిత తండ్రికి పంపి పైశాచిక ఆనందం పొందారని ఆయన ఆరోపించారు అయినా సిగ్గు లేకుండా మేము క్షమాపణ చెప్పాము మీకేమి సమస్య అని మాట్లాడటం వైసిపి నాయకత్వంలోని నిర్లజ్జపై అహంకారాన్ని బయటపెడుతుందని ఆయన విమర్శించారు ఇలాంటి దాడులు ఒక వ్యక్తిపై జరిగిన హింస మాత్రమే కావని అవి మొత్తం దళిత సమాజాన్ని అవమానపరిచే భయపెట్టే ప్రయత్నాలేనని ఆయన ఆరోపించారు. తప్పు చేస్తే కొట్టడానికి తప్ప తాగి కొట్టడానికి తేడా ప్రజలకు తెలుసని ఇలాంటి చెత్త రాజకీయాలు వైసిపి మానుకోవాలని ఆయన అన్నారు పల్నాడు దళిత వృద్ధుడు సింగయ్య తలను నిమ్మకాయలా నలిపినట్టు తన కారు టైర్ కింద నలిపి జగన్ పొట్టన పెట్టుకున్నాడని ఆయన విమర్శించారు. అతని భార్యను బెదిరించి పోలీసులకు తప్పుడు స్టేట్మెంట్ ఎలా ఇచ్చారో ఇప్పుడు కూడా అదే స్ట్రాటజీ ని జగన్ రెడ్డి తిరుపతిలో కూడా అనుసరిస్తున్నాడని ఆయన ఆరోపించారు వైసిపి ఒక దళిత వ్యతిరేక పార్టీ అని మరొకసారి రుజువు అయిందని అధికారులు ఉన్నప్పుడు దళితులపై హింస దౌర్జన్యం అక్రమ కేసులు పెట్టి ఎన్నో ఇబ్బందులకు గురి చేశారని ఆయన ఆరోపించారు. ఇప్పుడు అధికారులు లేనప్పటికీ అదే తీరు అదే హింస రాష్ట్రంలో కొనసాగుతుందని ఆయన ఆరోపించారు దళిత హక్కుల భద్రత గౌరవం పట్ల వైసీపీ పార్టీకి గౌరవం లేదని ప్రజాస్వామ్యం పేరుతో కురోరా రాజకీయాలు చేస్తున్నారని ప్రజలందరూ అర్థం చేసుకోవాలని ఆయన తెలిపారు. దళిత సమాజం మీద ఇలాంటి దాడులను ఎవరు సహించరని ఆయన తెలిపారు జగన్మోహన్ రెడ్డి తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని నిజంగా దళితులపై జగన్మోహన్రెడ్డి చిత్తశుద్ధి ఉంటే దళితులపై దాడులు చేసి ఆ పార్టీ నేతలను రౌడీలను వెంటనే పార్టీ నుంచి పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో చట్టము అందరికీ సమానము దళితులపై బలహీనవర్గాలపై హింస చర్యలు చేస్తే లేదా భయపెట్టే ప్రయత్నం చేస్తే అలాంటి వారిని క్షమించే ప్రశ్నలేదని ఆయన తెలిపారు. నేరస్తులు ఎవరైనా కావచ్చు రాజకీయ



నాయకులైన వారి అనుచరులైనా శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సంరక్షణకు కోటమే ప్రభుత్వం కఠినంగా చర్యలు తీసుకుంటుందని ఆయన హెచ్చరించారు. దీనిపై వెంటనే పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డీజీపీ పాతర్ల రమేష్ విజ్ఞప్తి చేశారు.

# గిరిజన జీవితాల్లో టీడీపీ వెలుగులు

## మైదానాలకు దీటుగా తండాల అభివృద్ధి, ఆదివాసీ దినోత్సవంలో పత్తికొండ ఎమ్మెల్యే శ్యామ్‌కుమార్ వెల్లడి




పత్తికొండ, (చైతన్యరథం): అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ సోదర సోదరీమణులందరికీ పత్తికొండ ఎమ్మెల్యే కేఈశ్యామ్ కుమార్‌కి శుభాకాంక్షలు తెలియజేసారు. ఏజెన్సీ ప్రాంతాలను మైదాన ప్రాంతాలతో సమానంగా అభివృద్ధి చేసి ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. 2014, 2019 టీడీపీ హయాంలో తాండలకు రహదారులు, మంచినీటి సదుపాయాలను కల్పించి గిరిజన గ్రామాలలో ప్రజలకు దాహం తీర్చిన మాజీ ఉప ముఖ్యమంత్రివర్యులు కేఈ కృష్ణమూర్తి సేవలను గుర్తు చేశారు. ఎన్నో అభివృద్ధి పనులను చేసిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది ఒక్క టీడీపీ ప్రభుత్వమే అని తెలియజేసారు. ఏడాది కాలంలో ఏజెన్సీ ప్రాంతాల్లో అభివృద్ధి కోసం, వారి సంక్షేమం కోసం తీసుకున్న చర్యలను వివరించారు. రానున్న రోజుల్లో చేపట్టే కార్యక్రమాలపై వారితో చర్చించి నిర్ణయాలు వెల్లడిస్తామన్నారు. ఆదివాసీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రంజిత్ భాషా ఆదివాసీ గిరిజన నాయకులు పాల్గొన్నారు.

### బుక్కపట్నంలో టీడీపీ కార్యాలయం ప్రారంభం

బుక్కపట్నం, (చైతన్యరథం): మండల కేంద్రంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి చేతుల మీదుగా టీడీపీ కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడి పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం జెండా రెపరెపలాడేలా కార్యకర్తలు సైనికుల పనిచేయాలని పిలుపునిచ్చారు.



### వైసీపీ నుంచి 6 కుటుంబాలు టీడీపీలో చేరిక

మండలం సికాయవారిపల్లి వైసీపీకి చెందిన జి సూర్యనారాయణ వెంకట్ రాముడు, మాధవ జి వెంకట్రాముడు తోపాటు 6కుటుంబాలు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలోకి చేరిన వారికి మాజీమంత్రి, ఎమ్మెల్యే టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

# వాత్సల్యం ఉప్పొంగిన వేళ..

## ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుకు రాఖీ కట్టిన మరో ఎమ్మెల్యే సింధూరారెడ్డి, చీర, సారె పెట్టిన రాజు దంపతులు



మడకశిర, మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎమ్మెస్ రాజుకు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి రాఖీ కట్టి తన వాత్సల్యాన్ని చాటుకున్నారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని అనంతపురంలోని ఎమ్మెల్యే రాజు నివాసానికి సింధూరా రెడ్డి రాఖీతో వెళ్లారు. తమ నివాసానికి వచ్చిన సింధూరారెడ్డిని రాజు దంపతులు ఆప్యాయంగా ఆహ్వానించారు. సింధూరారెడ్డి రాకతో రాజు ఇంట్లో సందడి వాతావరణం నెలకొంది. రాఖీ కట్టిన సింధూరా రెడ్డికి రాజు దంపతులు చీర, సారె పెట్టి గౌరవించారు. అనంతరం కాసేపు సరదాగా ముచ్చటించారు.

# ఈదులవంక కల్వర్టుకు మరమ్మతులు

## ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ వెల్లడి, అధికారులతో కలిసి పరిశీలన

ముదిగుబ్బ, (చైతన్యరథం): మండలం మల్లేపల్లి రోడ్డులో తెగిపోయిన ఈదులవంక కల్వర్టు మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన చేపడతామని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ తెలిపారు. గురువారం రాత్రి కురిసిన వర్షాలకు ఈ కల్వర్టు తెగిపోవడంతో15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పరిటాల శ్రీరామ్ అధికారులతో కలిసి కల్వర్టును పరిశీలించారు. పంచాయతీరాజ్ డీ.ఇ శ్రీరాములు, తహసీల్దార్ నారాయణస్వామి కలిసి కూలిపోయిన కల్వర్టును నిశితంగా పరిశీలించారు. దీని మరమ్మతులకు ఎంత మేర ఖర్చవుతుంది.. ఎంత నిధులు అవసరం..నిధులు వచ్చాక ఎన్ని రోజులకు పనులు పూర్తి చేస్తారు వంటి అంశాల గురించి తెలుసుకున్నారు. వెంటనే కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాలని శ్రీరామ్ అధికారులకు సూచించారు. తాను కలెక్టర్‌తో ప్రత్యేకంగా మాట్లాడుతానని అన్నారు. ప్రస్తుతం కల్వర్టు దెబ్బతినడం వల్ల ఈ మార్గంలో ప్రయాణం చేసే 15గ్రామాల ప్రజలు మలకవేముల క్రాస్ మీదుగా వెళ్లాల్సి వస్తోందని శ్రీరామ్ అన్నారు. మండల కేంద్రానికి రావాలంటే మరో పది కిలోమీటర్లు చుట్టేసుకుని రావాల్సి ఉంటోందన్నారు. దినపత్రికల్లో తెలిపినట్టు 19ఏళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వం హయాంలో పీఎంజీఎస్‌వై పథకం కింద రూ.621.38 లక్షల నిధులు ఖర్చు చేసి ఈ రోడ్డు నిర్మించారన్నారు. 2020లో కురిసిన తుపానుతో మద్దిలేరు వాగు ఉప్పొంగి నీటి ఉధ్ధతికి పూర్తిగా కొట్టుకుపోయిందన్నారు. అధికారులు తాత్కాలికంగా రాళ్లు, మట్టివేసి మరమ్మతులు చేసినా రెండోసారి అధిక వర్షాలకు మట్టి కొట్టుకుపోయి అంచులు విరిగిపడ్డాయన్నారు. గత ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపకుండా మళ్లీ తాత్కాలికంగా మరమ్మతులు చేసి వదిలేయడం వల్ల సమస్య వచ్చిందన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని త్వరలోనే మరమ్మతు పనులు ప్రారంభమవుతాయని శ్రీరామ్ తెలిపారు.






### ఊపందుకున్న ఎన్నికల ప్రచారం

#### నేతలతో సమావేశమైన మంత్రి సవిత

పులివెందుల, (చైతన్యరథం): జడ్పీటీసీ ఉప ఎన్నికల సందర్భంగా పులివెందుల తెలుగుదేశం కార్యాలయంలో మంత్రులు ఎమ్మెల్యేలు నాయకులతో కలిసి పులివెందుల జడ్పీటిసి ఉప ఎన్నిక, పోలింగ్ సరళి గురించి కడప ఇంచార్జ్ మంత్రి బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత చర్చించారు. ఈ సందర్భంగా పలు కుటుంబాలు వైసీపీ పార్టీ వీడి తెలుగుదేశం పార్టీలోకి చేరాయి. వారికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.



### పులివెందులలో జమ్మలమడుగు టీడీపీ నేతల ప్రచారం

#### పాల్గొన్న చదిపిరాళ్ల భూపేష్ తదితరులు

పులివెందుల, (చైతన్యరథం): పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా శనివారం పులివెందుల మండలం నల్లపురెడ్డి గ్రామంలో పులివెందుల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రారెడ్డి ( బీటెక్ రవి) కుమారుడు రామిరెడ్డితో కలిసి, జమ్మలమడుగు నియోజవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న జడ్పీటీసీ ఎన్నికల్లో పులివెందుల మండల జడ్పీటీసీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డిని సైకిల్ గుర్తుకు ఓటు వేసి, వేయించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



### తుమ్మలపల్లిలో ఎంపీ శబరి ప్రచారం

తుమ్మలపల్లిలో జడ్పీటీసీ అభ్యర్థి మారెడ్డి లతా రెడ్డి, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, విస్తృతంగా ప్రచారం చేశారు. లింగాల మండల టీడీపీ ఇంచార్జ్ దేవిరెడ్డి సంజీవరెడ్డి, లింగాల మండల అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, షబ్బీర్, బలసామిరెడ్డి , జగన్ రెడ్డి, మబు షరీఫ్, తక్కల షరీఫ్, భాస్కర,శివశంకర్, యాసీన్, గంగాధర్ రెడ్డి, రాహుల్, శేట్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు,

### ఒంటిమిట్టలో టీడీపీ బావుటా ఎగరాలి

ఒంటిమిట్ట ఉప ఎన్నికపై సీడప్ చైర్మన్ దీపక్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ రవి నాయుడు, బద్వేల్ టీడీపీ నాయకులు కొనిరెడ్డి రితేష్ రెడ్డితో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సమావేశమయ్యారు. ఒంటిమిట్టలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి అద్దులూరి ముద్దుకృష్ణారెడ్డిని గెలిపించేందుకు నాయకులంతా సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే కందికుంట కోరారు. శనివారం స్థానిక హరిత హోటల్‌లో సమావేశం జరిగింది.





## మోదీకి రాఖీ కట్టిన చిన్నారులు

**ప్రధాని నివాసంలో రక్షా బంధన్ సందడి**

ప్రధాని నరేంద్రమోదీ రక్షా బంధన్ వేడుకలను విద్యార్థులు, ఆధ్యాత్మిక సంస్థ బ్రహ్మకుమారి సభ్యులతో కలిసి జరుపుకొన్నారు. ఢిల్లీలోని ప్రధాని నివాసంలో శనివారం ఉదయం 7 గంటల సమయంలో పలువురు విద్యార్థులు, బ్రహ్మకుమారి సభ్యులు మోదీకి రాఖీ కట్టారు. అనంతరం మోదీ వారితో కొంతసేపు సరదాగా ముచ్చటించారు. ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. గతేడాది కూడా ప్రధాని ఇలాగే స్కూల్ విద్యార్థినులతో రాఖీ కట్టించుకున్న సంగతి తెలిసిందే. అంతకు ముందు రాఖీ పండుగను పురస్కరించుకొని దేశ ప్రజలకు మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. "సోదర సోదరీమణుల మధ్యఅపరిమిత ప్రేమకు ప్రతీక ఈ రక్షా బంధన్. ఈ పండుగ మీ బంధాలను మరింత తీపికరంగా చేయాలని, ఆప్యాయత, సామరస్య భావాలను బలోపేతం చేయాలని, ప్రజంతా ఆనందంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నా" అంటూ మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు.

### జమ్మూ కశ్మీర్‌లో

## ఎదురు కాల్పులు

**ఇద్దరు జవాన్ల మృతి, కొనసాగుతున్న ఆపరేషన్**



ఉగ్రవాదుల ఏరివేతే లక్ష్యంగా జమ్మూ కశ్మీర్‌లోని కుల్గాం ప్రాంతంలో సైనిక ఆపరేషన్ కొనసాగుతోంది. శుక్రవారం అర్ధరాత్రి, భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఇద్దరు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఇక్కడి దట్టమైన అటవీ ప్రాంతంలో ముగ్గురు ఉగ్రవాదులు రహస్య స్థావరాలను ఏర్పరుచుకొని ఉంటున్నట్లు నిఘా సమాచారం అందింది. దీంతో భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి కాల్పులు జరిపాయి. ఈ క్రమంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు సైనికులు లాన్స్ నాయక్ ప్రీతిపాల్ సింగ్, సిపాయి హర్విందర్ సింగ్ మరణించారు. మరో ఇద్దరు సైనికులు గాయపడ్డారు. మృతుల కుటుంబాలకు చినార్ కార్ప్స్ సానుభూతి వ్యక్తం చేసింది. ఆపరేషన్ ఇంకా కొనసాగుతుందని తెలిపింది.

ఉగ్రవాదులు ఉన్నారన్న నిఘా సమాచారంతో ఆగస్టు 1న అఖల్ గ్రామ పరిసరాల్లో 'ఆపరేషన్ అఖిల్' పేరుతో భద్రతాధికారులు ఆపరేషన్ చేపట్టారు. ఇది తొమ్మిదో రోజుకు చేరుకుంది. ఈ ఆపరేషన్లో ఇప్పటికే పలువురు ఉగ్రవాదులను దళాలు మట్టుబెట్టాయి. ఈ క్రమంలో పలువురు సైనికులు కూడా గాయపడ్డారు. ఇక, ఆపరేషన్ నేపథ్యంలో ఈ ప్రాంతంలో తుపాకీ శబ్దాలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. దీంతో ఇక్కడి మహిళలు, చిన్నారులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. దీంతో ఇక్కడి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాదిలో ఇంత సుదీర్ఘ సమయం కొనసాగుతున్న ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ ఇదేనని అధికారులు చెబుతున్నారు.

# ఆపరేషన్ సిందూర్‌తో పాక్ కాళ్లబేరం

### ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ వెల్లడి



పహల్గాం దాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ పాకిస్థాన్కు భారత్ గట్టి దెబ్బ కొట్టింది. మన సైన్యం జరిపిన మెరుపుదాడులతో శత్రు సేనలస్థావరాలు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. ఈ ఆపరేషన్‌పై తాజాగా వాయు సేనాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ మాట్లాడుతూ కీలక విషయాలను వెల్లడించారు. 'సిందూర్ సమయంలో పాక్‌కు చెందిన ఐదు యుద్ధ విమానాలను మన సైన్యం కూల్చేసినట్లు తెలిపారు. దాయాది వాయుసేన సామర్థ్యానికి జరిగిన నష్టంపై భారత్ ప్రకటన చేయడం ఇదే తొలిసారి.

బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన 'ఆపరేషన్ సిందూర్'కు సంబంధించిన వివరాలను పంచుకున్నారు. "పక్కా ప్రణాళికతో ఆపరేషన్ సిందూర్ నిర్వహించాం. అది చాలా హై-టెక్ యుద్ధం. కేవలం 80-90 గంటల్లోనే మా లక్ష్యాల్లో చాలావరకు సాధించాం. యుద్ధం ఇలాగే కొనసాగితే... భారీ మూల్యం తప్పదని వారికి (పాక్) అర్థమైంది. అందుకే కాళ్ల బేరానికి వచ్చారు. చర్చలు జరుపుదామని సందేశమిచ్చారు." అని ఏపీ సింగ్ తెలిపారు.

"ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కుచెందిన కనీసం ఐదు యుద్ధ విమానాలను కూల్చేశాం. మరో పెద్ద విమానాన్ని కూడా ధ్వంసం చేశాం. మన సైన్యం దాడి చేసిన పాక్ ప్రధాన ఎయిర్ ఫీల్డ్‌లలో షహబాజ్ జకోబాబాద్ స్థావరం ఒకటి. అక్కడ ఎఫ్-16 హ్యాంగర్ ఉంది. మన సైన్యం దాడితో అది సగానికి పైగా దెబ్బతింది. అక్కడ కొన్ని యుద్ధ విమానాలు ఉన్నాయని, అవి తీవ్రంగా దెబ్బతిన్నాయని మేం అంచనాకు వచ్చాం. ఆపరేషన్ సమయంలో మన గగనతల రక్షణ వ్యవస్థ, ఎస్-400 క్షిపణి వ్యవస్థ సమర్థంగా పనిచేశాయి" అని ఎయిర్ చీఫ్ మార్షల్ వివరించారు.

# ట్రంప్ నెత్తిన సుంకాల చెత్త

**- అమెరికా ఆర్థికవేత్త అంచనా**
**- ఓపిక పడితే భారత్‌కు మేలు**



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ వార్‌పై స్వదేశంలోనూ వ్యతిరేకత ఎదురవుతోంది. ఈ సుంకాల వల్ల అమెరికా ప్రజలకే ఎక్కువ నష్టం వాటిల్లనుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా అమెరికా ఆర్థికవేత్త, జాన్ హాప్ కిన్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్ స్టీవ్ హాంకీ కూడా ఇదేవిధమైన అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. సుంకాల పేరుతో ట్రంప్ కడుతున్న పేక మేడ త్వరలోనే కూలిపోతుందని దుయ్యబట్టారు. అప్పటి వరకు భారత్ ఆయన జోలికి వెళ్లకపోవడమే మంచిదని సూచించారు.

జాతీయమీడియా సంస్థ ఎన్డీటీవీతో మాట్లాడిన స్టీవ్ హాంకీ, భారత్‌పై ట్రంప్ విధించిన సుంకాల అంశాన్ని ప్రస్తావించారు. "సుంకాలపై ట్రంప్ నిర్ణయాలు పూర్తిగా అర్థరహితం. ఇక్కడో విషయం చెప్పాలి. 'తనను తాను నాశనం చేసుకునే శత్రువు జోలికి వెళ్లకపోవడమే మంచిదనేది నెపోలియన్ మాట. ఇప్పుడు ట్రంప్ కూడా ప్రపంచదేశాలతో వాణిజ్య యుద్ధాలు చేస్తూ తనను తానే నాశనం చేసుకుంటున్నారని అనిపిస్తోంది. భారత్ విషయానికొస్తే.. ప్రస్తుతం ప్రధానమంత్రి నరేంద్రమోదీ, విదేశాంగ మంత్రి జైశంకర్ కొంతకాలం ఓపిక పట్టి ఎదురుచూడాలి. ఎందుకంటే ట్రంప్ పేకమేడ త్వరలోనే కూలిపోతుంది" అని ఆ ప్రొఫెసర్ అభిప్రాయపడ్డారు. అమెరికన్ల వినిమయ ఖర్చులు పెరిగితే తమ దేశ ద్రవ్యలోటు ఎక్కువవుతుందని హంకీ అంచనావేశారు. టారిఫ్‌పై ట్రంప్ విధానాలు చాలా చెత్తగా ఉన్నాయని దుయ్యబట్టారు. దీనివల్ల తమ ఆర్థికవ్యవస్థకే నష్టం చేకూరే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. రష్యా చమురును కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్‌పై సుంకాలను ట్రంప్ రెట్టింపు చేసి 50 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే. ఈ సుంకాల విషయం తేలేవరకు న్యూఢిల్లీతో వాణిజ్య చర్చలు కూడా జరపబోమని తేల్చి చెప్పారు. దీంతో ఇరుదేశాల మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. ట్రంప్ నిర్ణయాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. ఇది అన్యాయమైన, అసమంజసమైన చర్య అని పేర్కొంది. జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని న్యూఢిల్లీ స్పష్టం చేసింది.

# మహిళల రక్షణలో మమత విఫలం

- **న్యాయమడిగితే రక్తం కళ్లజూశారు**
- **కలకత్తా డాక్టర్ హత్యాచార బాధితురాలి తల్లిదండ్రులు**

తమ కుమార్తె కేసులో తగిన న్యాయం చేయాలని శాంతియుతంగా నిరసన చేపట్టిన తమపై పోలీసులు లాఠీ ఛార్జీ చేశారని ఆర్జీకర్ మృతురాలి తల్లి ఆవేదన వ్యక్తంచేశారు. న్యాయం చేయాలని అడిగినందుకు వారు తమ రక్తాన్ని కళ్ల జూశారన్నారు.వైద్యురాలి హత్యాచార ఘటన జరిగి ఏడాది కావడంతో 'నబన్నా అభియాన్' పేరుతో జూనియర్ వైద్యులు శనివారం రాష్ట్రంలో పలుచోట్ల ర్యాలీలు నిర్వహించారు. ఈ ర్యాలీలో ఆర్జీకర్ మృతురాలి తల్లిదండ్రులు కూడాపాల్గొన్నారు.రాష్ట్రంలో మహిళలకు రక్షణకల్పించడంలో విఫలమైన ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పదవి నుంచి దిగిపోవాలని డిమాండ్ చేస్తూ.. నిరసనకారులు రాష్ట్ర సచివాలయంలోకి ప్రవేశించడానికి ప్రయత్నించారు. పోలీసులు ఆందోళనకారులపై లాఠీ ఛార్జ్ చేశారు. ఇందులో మృతురాలి తల్లిదండ్రులు గాయపడినట్లు భాజపా నేత సుమేదు అధికారి తెలిపారు. శాంతియుత ర్యాలీ చేయడానికి కోర్టు అనుమతి తీసుకున్నప్పటికీ పలు ప్రాంతాల్లో పోలీసులు తమ ర్యాలీని అడ్డుకోవడానికి ప్రయత్నించినట్లు మృతురాలి తల్లి ఆరోపించారు. ఈ నిరసన కార్యక్రమంలో పలువురు భాజపా నేతలు పాల్గొన్నారు. గతేడాది ఆగస్టు 9వ తేదీ రాత్రి ఆర్జీ కర్ ఆసుపత్రి ఆవరణలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన ప్రకంపనలు సృష్టించిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి ఆసుపత్రిలోని సీసీటీవీలో నమోదైన దృశ్యాల ఆధారంగా సంజయ్ రాయ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం అతడికి జీవిత ఖైదును విధించింది. అయితే ఈ కేసులో రాజకీయ నేతల హస్తం ఉందని, ఈ కోణంలో సీబీఐ దర్యాప్తు చేయట్లేదని మృతురాలి కుటుంబం ఆరోపిస్తోంది.



# పుతిన్‌తో భేటీ ఖరారు!

**ట్రూత్ సోషల్ మీడియాలో అమెరికా అధ్యక్షుడి పోస్ట్ ❑ ధ్రువీకరించిన రష్యా అధ్యక్షుడు**



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య భేటీ ఖరారైంది. వీరిద్దరూ కలిసి ఆగస్టు 15న అలాస్కాలో సమావేశం కానున్నారు. ఈ విషయాన్ని ట్రంప్ తన అధికారిక ట్రూత్ సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు. ఈ సమావేశానికి ముందు పుతిన్ చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, భారత ప్రధాని నరేంద్ర మోదీలతో మాట్లాడనున్నారు. రష్యా 2022లో ఉక్రెయిన్‌పై దాడి చేసినప్పటి నుంచి ఈ యుద్ధం ఆగకుండా కొనసాగుతోంది. దీంతో లక్షలాది మంది తమ ఇళ్లను వదిలి పారిపోయారు, వేలాది మంది చనిపోయారు. ఈ యుద్ధం ఆపడానికి ఇప్పటివరకు మూడు సార్లు చర్చలు జరిగినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పుడు ట్రంప్, అలస్కాలో పుతిన్‌తో మాట్లాడి ఈ సమస్యకు ఒక ముగింపు తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య భూభాగాలను మార్చుకోవడం ద్వారా ఈ యుద్ధాన్ని ఆపొచ్చని ట్రంప్ ఆలోచన. అంటే, రెండు దేశాలూ కొంత భూమిని ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకుంటే, శాంతి సాధ్యమవుతుందని ట్రంప్ భావిస్తున్నారు. అయితే పుతిన్ ఈ భేటీ గురించి ఇంకా ధృవీకరణ ఇవ్వలేదు. ఆయన చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, భారత ప్రధాని నరేంద్ర మోదీతో ఈ విషయంపై చర్చించారు. చైనా, భారత్ రెండూ ఈ యుద్ధానికి శాంతియుత పరిష్కారం కోసం తమదైన ప్రయత్నాలు చేస్తున్నాయి. కానీ పెద్దగా ఫలితం కనిపించలేదు. పుతిన్ గతంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్స్కీతో చర్చలు జరపడానికి సిద్ధంగా లేమని చెప్పారు. ఆయన అభిప్రాయం ప్రకారం, చర్చలు చివరి దశలో ఉన్నప్పుడే జెలెన్స్కీతో మాట్లాడతారట. కానీ జెలెన్స్కీ మాత్రం, శాంతి చర్చల్లో ఉక్రెయిన్ కూడా ఉండాలని, అది న్యాయమైనదని అంటున్నారు.

**రష్యా డిమాండ్స్ ఏంటి?**

గత నెలలో ఇస్తాంబుల్‌లో జరిగిన చర్చల్లో రష్యా కొన్ని కఠినమైన డిమాండ్లు పెట్టింది. ఉక్రెయిన్ తమ నియంత్రణలో ఉన్న కొన్ని భూభాగాలను వదులుకోవాలని,అలాగే పాశ్చాత్య దేశాల సైనిక సహాయాన్ని తిరస్కరించాలని రష్యా కోరింది. ఇవి చాలా పెద్ద డిమాండ్లు కాబట్టి, ఉక్రెయిన్ ఒప్పుకోవడం కష్టమే.

**అలస్కా ఎందుకు?**

అలస్కా అనేది అమెరికాకు చెందిన రాష్ట్రం, రష్యాకు దగ్గరగా ఉంటుంది. ఈ భేటీకి అలస్కాను ఎంచుకోవడం వెనుక ట్రంప్ ఆలోచన ఏమిటో స్పష్టంగా తెలియదు. కానీ ఇది ఒక స్ట్రాటజిక్ ఎంపిక కావొచ్చు. ఇది ట్రంప్, పుతిన్‌ల మధ్య 2019 తర్వాత మొదటి సారి సిట్టింగ్ ప్రెసిడెంట్స్‌గా జరిగే భేటీ అని చెప్పవచ్చు. వీళ్లిద్దరూ జనవరి నుంచి ఫోన్‌లో చాలా సార్లు మాట్లాడుకున్నారు, కానీ ఇలా డైరెక్ట్‌గా కలవడం ఇదే మొదటిసారి.

**ఈ భేటీ ఫలితం?**

ఈ భేటీ శాంతిని తీసుకొస్తుందా లేక మళ్లీ ఒక విఫలమైన చర్చగా మిగిలి పోతుందా అనేది ఇప్పుడు పెద్ద ప్రశ్న. ట్రంప్ ఆలోచనలు,పుతిన్ డిమాండ్లు, ఉక్రెయిన్ ఆశలు ఇవన్నీ ఒకదానితో ఒకటి సరిపోలాలంటే కొంచెం కష్టమేనని నిపుణులు అంటున్నారు. కానీ, ఈ సమావేశం చివరకుఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగింపునకు దారి తీస్తుందా లేదా అనేది చూడాలి మరి.

# ఇతడ్ని అప్పగిస్తే రూ.430 కోట్లు!



వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో రేటును పెంచుకుంటూ పోతోంది అగ్రరాజ్యం అమెరికా. మదురో అరెస్టుకు అవసరమైన సమాచారం ఇచ్చినవారికి ఇప్పుడు ఏకంగా 50 మిలియన్ డాలర్లు (రూ. 430 కోట్లు) ఇస్తామని ప్రకటించింది. దీనికి సంబంధించి అమెరికా అటార్నీ జనరల్ పామ్ బాండీ సోషల్ మీడియా మాధ్యమం 'ఎక్స్'లో ఓ వీడియోను పోస్టు చేశారు. అమెరికా అధ్యక్షుడుగా డోనాల్డ్ ట్రంప్ తొలిసారి అధికారంలోకి వచ్చినప్పుడు మదురోపై 15 మిలియన్ డాలర్ల రివార్డును ప్రకటించారు. తర్వాత అధికారంలోకి వచ్చిన బైడెన్ ప్రభుత్వం దానిని 25 మిలియన్ డాలర్లకు పెంచింది. అది కాస్తా ఇప్పుడు ట్రంప్ రెండో సారి అధ్యక్షుడయ్యాక ఈ రేటు 50 మిలియన్ డాలర్లకు చేరింది. ఎందుకీ వేట.. అనే విషయానికి వస్తే, వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో కొన్నేళ్లుగా అమెరికాకు కొరకరాని కొయ్యగా మారారు. అమెరికాలో డ్రగ్స్ వ్యాప్తికి, హింసను ప్రేరేపించేందుకు నికోలస్ మదురో కుట్రలు చేస్తున్నారన్నది అమెరికా వాదన. ఈ నేపథ్యంలో ఇప్పటికే అమెరికాలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ మదురోకు సంబంధించిన 700 మిలియన్ డాలర్ల విలువైన ఆస్తులను సీజ్ చేసింది. వీటిల్లో మదురోకు చెందిన ప్రైవేట్ జెట్‌లు, తొమ్మిది వాహనాలు ఉన్నాయి. ట్రంప్ నాయకత్వం నుంచి మదురో ఎట్టిపరిస్థితుల్లో తప్పించుకోలేరని బాండీ అంటున్నారు. కాగా, నికోలస్ మాదురోను అరెస్ట్ చేయిస్తే, 50 మిలియన్ డాలర్ల బహుమతి అంటూ అమెరికా అటార్నీ జనరల్ పామ్ బాండీ చేసిన ప్రకటనను వెనిజులా విదేశాంగ మంత్రి య్వాన్ గిల్ అవహేళన చేశారు. అటు, సోషల్ మీడియాలోనూ బాండీ ప్రకటనపై సైటైర్లు వేస్తున్నారు నెటిజన్లు. నికోలస్ వెనిజులాలోనే ఉన్నారంటూ కామెంట్లు పెడుతున్నారు. అటు, అమెరికా – వెనిజులా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. మదురోకు కేవలం కొకైన్ కాకుండా ఫెంటెనిల్ స్మగ్లింగ్‌తో కూడా సంబంధాలున్నాయని అమెరికా అంటోంది. ఇప్పటికే 2020 మార్చిలో ఆయనపై దక్షిణ న్యూయార్క్ డిస్ట్రిక్ట్‌లో కేసులు నమోదయ్యాయి.



విమానం గాల్లో ఉండగా..

## పవర్ బ్యాంక్‌లో మంటలు

**ఆ తరువాత ఏం జరిగింది?**

కేఎల్ఎమ్ రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఓ విమానంలో గత మంగళ వారం షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. విమానం గాల్లో ఉండగా ఓ పవర్ బ్యాంక్ లో మంటలు రేగడంతో విమానమంతా దట్టమైన పొగలు వ్యాపించాయి. ప్రయాణికులు భయంతో వణికిపోయారు. పొగను పీల్చకుండా తమ ముఖాలకు కర్చీఫ్‌లను అడ్డు పెట్టుకున్నారు. బ్రెజిల్‌లోని సావో పావోలో నుంచి ఆమ్‌స్టర్ డ్యామ్‌కు వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. వెంటనే అప్రమ త్తమైన ఫ్లైట్ అటెండెంట్ ఫైర్ ఎక్స్‌టింగ్విషర్‌తో మంటలను ఆర్పేశారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆ తరువాత విమానం యథా ప్రకారం సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకుంది. ఈ ఘటనపై ఎయిర్‌లైన్స్ సంస్థ స్పందించింది. పవర్ బ్యాం కుకు మంటల అంటుకోవడంతో విమానంలో పొగలు వ్యాపించాయని తెలిపింది. ఫ్లైట్ సిబ్బంది వెంటనే మంట లను ఆర్పేశారని వెల్లడించింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని వెల్లడించింది. పవర్ బ్యాం క్స్ లేదా పోర్టబుల్ చార్జర్స్‌లో లిథియమ్ అయాన్ బ్యాటరీ లు ఉంటాయన్న విషయం తెలిసిందే. పవర్ బ్యాంక్స్‌ను విమానాల్లో తీసుకెళ్లేందుకు అనుమతి ఉన్నా ప్యాసిం జర్లు వాటిని తమ వద్దే పెట్టుకోవాల్సి ఉంటుంది. చెక్డ్ లగేజీలో వీటిని అనుమతించరు. మార్గ మధ్యంలో బ్యాటరీ వేడెక్కి అగ్నిప్రమాదం జరిగే అవకా శం ఉండటంతో ఎయిర్ లైన్స్ సంస్థలు ఈ నిబంధనను పాటిస్తాయి. ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ గణాంకా ల ప్రకారం విమానాల్లో లిథియ మ్ అయాన్ బ్యాటరీల్లో మంటలు చెలరేగిన ఉదంతాలు 2015తో పోలిస్తే 388 శాతం మేర పెరిగాయి. వారానికి సగటు రెండు మార్లు ఈ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈబ్యాటరీల విష యంలో ఫ్లైట్ అటెండెంట్స్ భయాందోళనలు వ్యక్తం చేస్తున్నట్టు ఓ సర్వేలో తేలింది. ఈ బ్యాటరీ తో ముప్పు ఉందని సర్వేలో పాల్గొన్న 87శాతం మంది అంగీకరించారు. ప్రతి నలుగురు ప్యాసింజర్లలో ఒకరు తమ చెక్డ్ బ్యాగేజీలో ఈబ్యాటరీలను కూడా పెట్టినట్టు వెల్లడించారు. ఇక గత నెలలో డెల్టా ఎయిర్‌లైన్స్‌కు చెంది న ఓ విమానంలో పవర్ బ్యాంకుకు మంటలు అంటుకో వడంతో ఫ్లోరిడాలో అత్యవసరంగా ల్యాండ్ కావాల్సి వచ్చింది. ఇప్పటికే కొన్ని ఎయిర్‌లైన్స్ పవర్ బ్యాంక్స్ విషయంలో నిబంధనలు కఠిన తరం చేశాయి. ఆగస్టు 1 నుంచి తమ విమానాల్లో పవర్ బ్యాంక్స్‌ను విని యోగిం చేందుకు అనుమతి ఉండదని ఎమిరేట్స్ ఎయిర్ లైన్స్ ఇటీవలే ప్రకటించింది. ప్యాసింజర్లు వీటిని తమ వెంట తెచ్చుకునేందుకు ఎప్పటిలాగే అనుమతి ఉన్నప్పటికీ విమా నంలో మాత్రం వినియోగించరాదు.

## మోదీ పర్యటనను స్వాగతించిన చైనా

బీజింగ్: భారత ప్రధాని మోదీ ఈ నెలాఖరులో చేపట్టనున్న చైనా పర్యటనను ఆ దేశం స్వాగతించింది. టియాంజిన్‌లో జరిగే షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీవో) శిఖరాగ్ర సదస్సులో ఆయన పాల్గొననున్నారు. ఏడేళ్ల విరామం అనంతరం ఆయన చైనా పర్యటనకు వెళ్లనుండడం విశేషం. ప్రధాని మోదీ రాకను స్వాగతిస్తున్నట్లు శుక్రవారం చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి గువో జియాకున్ చెప్పారు.

## ట్రంప్‌ను ఎలా డీల్ చేయాలో మోదీకి చెబుతా

**ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి**



అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఎలా డీల్ చేయాలో భారత ప్రధాని మోదీకి చెబుతానని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహూ పేర్కొన్నారు. భారత్‌పై అమెరికా 50 శాతం సుంకా లు విధించడంపై స్పందిస్తూ.. "ఈ విషయం లో భారత్, యూఎస్ ఒక అవగాహనకు రావాలి. మోదీ, ట్రంప్ ఇద్దరూ నాకు మంచి మిత్రులు. ట్రంప్‌తో ఎలా డీల్ చేయాలో మోదీకి చెబుతా. కాకపోతే వ్యక్తిగతంగా కలిసినప్పుడు.." అని నెతన్యాహూ చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌లో ఇజ్రా యెల్ ఆయుధాలను భారత్ ప్రయోగించిందని.. అవన్నీ చాలా బాగా పనిచే శాయని పేర్కొన్నారు. భారత్‌కు గగనతల నిఘా వ్యవస్థలు అందించేందుకు సిద్ధమని తెలిపారు.

### రష్యా ఆయిల్ కొనుగోళ్లను ఆపేస్తే

# చమురు దిగుమతులు భారమే

రష్యా నుంచి భారత్ భారీగా ముడి చమురును కొనుగోలు చేస్తుండటం పట్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. అమెరికా సుంకాలను క్రమంగా పెంచుతున్న తరుణంలో రష్యా నుంచి భారత్ ముడిచమురు కొనుగోళ్లను నిలిపివేస్తే ఏమవుతుందన్న ప్రశ్న తలెత్తుతోంది. మన దేశానికి రష్యా డిస్కౌంట్ ధరలకు ముడిచమురును విక్రయిస్తోంది. ఒకవేళ రష్యా నుంచి చమురు దిగుమతులను భారత్ నిలిపివేసినట్లయితే దేశ చమురు దిగుమతి బిల్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26)లో మిగిలిన కాలానికి దాదాపు 900 కోట్ల డాలర్లు (దాదాపు రూ.78,822 కోట్లు) పెరగడానికి అవకాశం ఉందని ఎస్‌బీఐ నివేదిక అంచనా వేస్తోంది. ఈ బిల్లు 2026–27 సంవత్సరంలో 1,200 కోట్ల డాలర్ల వరకు కూడా పెరగవచ్చని చెబుతోంది. ఇది భారత్‌కు పెనుభారంగానే చెప్పవచ్చు. రష్యా ఆయిల్ లేని పక్షంలో భారత్ ఇంధన కొనుగో ళ్లు మరింత ఖరీదుగా మారే అవకాశం ఉంద ని నివేదిక చెబుతోంది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం నేపథ్యంలో ఆ దేశంపై పశ్చిమ దేశా లు ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. దీని తర్వాత 2022 నుంచి రష్యా చవకగా ముడిచమురును ఆఫర్ చేయడంతో భారత్ తన అవసరాల కోసం దానిని కొనుగోలు చేస్తోంది. బ్యారెల్ రష్యన్ ఆయిల్ ధరను 60 డాలర్లకు పరిమితం చేయడం, తక్కువ ధరకు విక్రయించడం వల్ల భారత్ తన ఇంధన బిల్లును భారీగా ఆదా చేసుకునే అవకాశం ఏర్పడింది.

**ధరలు ఎందుకు పెరుగుతాయంటే?**

ప్రపంచ ముడిచమురు సరఫరాలో రష్యా వాటా ప్రస్తుతం 10 శాతంగా ఉంది. రష్యా నుంచి పలు దేశాలు ఒక్కసారిగా చమురు కొనుగోళ్లను నిలిపివేసి.. ఇతర దేశాలు తమ ఉత్పత్తిని పెంచని పక్షంలో ముడిచమురు ధరలు దాదాపు 10 శాతం పెరగవచ్చని ఎస్‌బీఐ నివేదిక అంచనా వేస్తోంది.

**భారత్ ఏం చేయవచ్చంటే?**

ఇంధన అవసరాల కోసం భారత్ దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోంది. ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈ సహా దాదాపు 40 దేశాల నుంచి ముడిచమురును సమకూర్చుకుంటోంది. గయానా, బ్రెజిల్, కెనడా వంటి దేశాలు కొత్తగా చేరడంతో భారత్ ఇంధన భద్రత మరింత మెరుగుపడింది. రష్యా ఆయిల్ లేకున్నా భారత్ ఇతర దేశాలతో ఉన్న సంబంధాలతో తన డిమాండ్‌కు సరిపడా ముడి చమురును సమకూర్చుకునే అవకాశం ఉంటుంది. కానీ అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరిగితే దేశ దిగుమతుల వ్యయాలు పెరగడానికి ఆస్కారం ఉంటుంది.

# జింబాబ్వేపై న్యూజిలాండ్ ఘనవిజయం

- ఇన్నింగ్స్ 359 పరుగుల తేడాతో గెలుపు
- 2-0తో సిరీస్ కైవసం



జింబాబ్వే పర్యటనలో ఉన్న న్యూజిలాండ్ జట్టు అదరగొడుతోంది. మొదటి టెస్ట్ మ్యాచ్‌లో తొమ్మిది వికెట్ల తేడాతో ప్రత్యర్థిని చిత్తు చేసిన న్యూజిలాండ్ బులవాయో వేదికగా జరిగిన రెండో టెస్ట్‌మ్యాచ్‌లోనూ ఇన్నింగ్స్ 359 పరుగుల తేడాతో విజయం సాధించింది. టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఇది మూడో అతిపెద్ద విజయంకావడం గమనార్హం. అలాగే న్యూజి లాండ్ సిరీస్‌ను 2-0తేడాతో కైవసం చేసుకుంది.

ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 125 పరుగులకే కుప్పకూలింది. తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన న్యూజిలాండ్ జట్టు 601/3వద్ద తమ మొదటి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. డెవన్ కాన్వే (153), హెన్రీ నికోలస్ (150 నాటౌట్), రచిన్ రవీంద్ర(165 నాటౌట్) భారీశతకాలతో విరుచుకుపడ్డారు. ఒకే మ్యాచ్‌లో ముగ్గురు బ్యాటర్లు 150 పై చిలుకు పరుగులు సాధించడం విశేషం.. తర్వాత రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన జింబాబ్వే జట్టు తమ మొదటి ఇన్నింగ్స్‌ను పునరావృతం చేస్తూ.. కేవలం 117 పరుగులకే ఆలౌటైంది. దీంతో న్యూజిలాండ్ ఈ మ్యాచ్‌లో ఇన్నింగ్స్ 359 పరుగుల తేడాతో గెలుపొందింది. ఇప్పటి వరకు న్యూజిలాండ్ జట్టుకు ఇదే అతి పెద్ద విజయం. ఇంతకు ముందు 2012లో న్యూజిలాండ్, జింబాబ్వే మీద ఇన్నింగ్స్, 301 పరుగుల తేడాతో విజయం సాధించింది. ప్రస్తుతం కివీస్ జట్టు తమ రికార్డును మెరుగు పరుచుకుంది. న్యూజిలాండ్ తరపున తొలిమ్యాచ్ ఆడుతున్న జాకరీ ఫౌల్కర్ అద్భుతంగా రాణించాడు. ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 38 పరుగులిచ్చి 4,రెండో ఇన్నింగ్స్‌లో 37పరుగులిచ్చి 5.. మొత్తంగా 9 వికెట్లు పడగొట్టాడు.

ఇంగ్లాండ్ జట్టు ఆస్ట్రేలియా మీద 1938లో ఓవల్‌లో ఇన్నింగ్స్, 579 పరుగులతో విజయం సాధించింది. టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఇప్పటి వరకు ఇదే అతి పెద్ద గెలుపుగా నిలిచింది.

# దూకుడే సిరాజ్ సక్సెస్‌కు కారణం



సిరాజ్‌లోని దూకుడే అతడిలోని అత్యుత్తమ ప్రదర్శనను బయటకి తెస్తోందని టీమిండియా మాజీ క్రికెటర్ అజింక్య రహానే అన్నాడు. ఇటీవల ఇంగ్లాండ్ తో ఐదు టెస్టుల సిరీస్ హీరో మహ్మద్ సిరాజ్. అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ గానే కాకుండా.. కీలకమైన ఆఖరి పోరులో చివరి వికెట్ తీసి టీమ్ ఇండియాను గెలిపించాడు. మైదానంలో దూకుడుగా ఉండే అతడు ప్రత్యర్థి పైనే కాదు.. అప్పుడప్పుడు సొంత జట్టు సభ్యుల పైనా అసహనం, ఆగ్రహం వ్యక్తం చేస్తుంటాడు. ఆయితే అదంతా జట్టు కోసమే కావడం గమనార్హం. ఇటీవల ముగిసిన ఓవల్ టెస్టులోనూ వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌పైనా ఒక దశలో సిరాజ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. ఇంగ్లాండ్ బ్యాటర్‌ను రనౌట్ చేసే అవకాశం చేజారినందుకే అలా ప్రవర్తించాడు. ఇలాగే గతంలో అజింక్య రహానే సారథిగా ఉన్నప్పుడూ ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది. తనపైనా సిరాజ్ ఆగ్రహం వ్యక్తంచేశాడని రహానే గుర్తు చేసుకున్నాడు. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో అతడిని ఆలస్యంగా బౌలింగ్‌కు తీసుకురావడంతో ఓసారి నాపైనా ఆగ్రహం వ్యక్తంచేశాడు. అప్పుడు సిరాజ్ చాలా దూకుడుగా ఉండేవాడని.. అందువల్లే అతనిలోని అత్యుత్తమ ప్రదర్శన బయటకు వచ్చిందని రహానే తెలిపాడు. 2020-21లో బోర్డర్ -గవాస్కర్ ట్రోఫీని టీమ్ ఇండియా కైవసం చేసుకుంది. సిరాజ్ విషయంలో నాకు ఎప్పటికీ నచ్చే విషయం ఒక్కటే సుదీర్ఘంగా స్పెల్స్ వేసేందుకు సిద్ధంగా ఉంటాడు. 2020-21 సిరీస్ సమయంలోనూ అంతే. ఇప్పుడు కూడా అదే ఉత్తేజంతో ఉండటం అద్భుతం. ఇప్పుడూ ఇదే దూకుడు. ఈ కోపం అతడిలోని ఉత్తమ ఆటగాడిని బయటకు తీసుకొస్తుంది. ఈ విషయాన్ని ఇంగ్లాండ్ సిరీస్‌లోనే చూశాం. తొలి బంతితోనే ప్రత్యర్థికి హెచ్చరికలు పంపిస్తాడు. అతడు అత్యుత్తమ నాణ్యత కలిగిన బౌలర్ అనడంలో సందేహం లేదని రహానే వెల్లడించాడు. రహానే నాయకత్వంలోనే సిరాజ్ అరంగేట్రం చేయటం గమనార్హం.

ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో సిరాజ్ అత్యధిక ఓవర్లు వేసిన బౌలర్‌గా నిలిచాడు. మొత్తం 185.9 ఓవర్లు విసిరాడు. ఐదు టెస్టులూ ఆడిన బౌలర్ అతడొక్కడే కావడం గమనార్హం. ఇంగ్లాండ్‌పై సిరాజ్ 1,113 బంతులు వేసేందుకు 31 కిలోమీటర్ల దూరం పరుగెత్తాడట. ఇది ఒలింపిక్ హాఫ్ మారథాన్ కంటే 10 కిలోమీటర్లు ఎక్కువకావడం గమనార్హం. సిరాజ్ తన తొలి టెస్టు సిరీస్‌ను ఆస్ట్రేలియాపై 2020లో ఆడాడు. అప్పుడు కూడా భారత్ తరపున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. ఆ సిరీస్‌లో మూడు టెస్టుల్లో 134.2 ఓవర్లు విసిరి 13 వికెట్లు తీశాడు.

# బుమ్రా లేకుండానే భారత్ గెలవడం అద్భుతం

స్టార్ పేసర్ బుమ్రా లేకుండానే భారత జట్టు టెస్ట్ మ్యాచ్‌లు గెలవడం చాలా గొప్ప విషయమని ఆస్ట్రేలియా జట్టు మాజీ కెప్టెన్ మైకెల్ క్లార్క్ అన్నాడు. టెండూల్కర్- అండర్సన్ ట్రోఫీలో భాగంగా ఇంగ్లాండ్‌తో టీమిండియా అయిదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడిన విషయం తెలిసిందే. వర్క్ లోడ్ కారణంగా జస్‌ప్రీత్ బుమ్రా కేవలం మూడు టెస్ట్ మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. అయితే బుమ్రా లేకున్నా టీమిండియా రెండు టెస్ట్ మ్యాచుల్లో గెలిచింది. ఇదంతా భారతజట్టు బౌలింగ్ దళం గొప్పదనమని ఆస్ట్రేలియా జట్టు మాజీ కెప్టెన్ మైకెల్ క్లార్క్ అన్నాడు. బుమ్రా గైర్హాజరీలో మహ్మద్ సిరాజ్ బౌలింగ్‌లో అద్భుతంగా రాణించాడన్నాడు. ఈ సిరీస్‌లో ఏకంగా 23 వికెట్లు తీసుకున్నాడు. రెండు సార్లు అయిదు వికెట్లు ప్రదర్శన చేశాడు. అలాగే టీమ్ ఇండియా ఈ టెస్ట్ సిరీస్‌ను 2-2తో సమం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. బుమ్రా లేకుండానే భారత్ మ్యాచుల్లో గెలవడం నిజంగా అద్భుతం. బుమ్రా జట్టులో ఉంటే టీమిండియాకు అదనపు బలం. ఓవల్లో జరిగిన చివరి మ్యాచ్‌లో విజయం సాధించి టీమిండియా సిరీస్‌ను సమం చేసింది. ఇది నిజంగా అద్భుతం. ప్రపంచ మేటి బౌలర్‌గా పేరున్న బుమ్రా లేకుండానే టీమ్ ఇండియా రెండు మ్యాచుల్లో విజయం సాధించింది. ఈ క్రెడిట్ అంతా భారత జట్టు బౌలింగ్ దళానికే చెందుతుందని ఓ పాడ్ కాస్ట్‌లో మాట్లాడుతూ మైకెల్ క్లార్క్ అన్నాడు. బుమ్రా ఏ జట్టులో ఉంటే అది అత్యుత్తమం. ఇందులో భిన్నాభిప్రాయాలు లేవు. కానీ.. అతడు లేకుండానే రెండు మ్యాచ్‌లు గెలవడం అనేది మామూలు విషయం కాదు. మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ కృష్ణ.. బుమ్రా లేని లోటును కనబడకుండా చేశారు. ముఖ్యంగా సిరాజ్.. ఎప్పుడైతే టీమ్ ఒత్తిడిలో ఉంటుందో అప్పుడు అద్భుతంగా రాణిస్తాడు. కీలకమైన ఓవల్ టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో అయిదు వికెట్ల ప్రదర్శన కూడా చేశాడని క్లార్క్ ప్రశంసించాడు.

### పెనాల్టీ పడినా సరే..

# గెలుపే ముఖ్యం

స్లో ఓవర్ రేట్ కారణంగా పాయింట్లు కోల్పోయే విషయాన్ని వదిలేసి విజయంపైనే దృష్టి సారించాలని భారత జట్టు ప్రధాన కోచ్ గౌతం గంభీర్ తన టీముకు స్పష్టంగా చెప్పిన విషయం వెలుగులోకి వచ్చింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరుకోవాలంటే పాయింట్ల పట్టికలో టాప్-2లో ఉండాలి. అందుకోసం ప్రతి పాయింట్, పర్శంటేజీ అత్యంత కీలకం. స్లో ఓవర్ రేట్ కారణంగా కొన్నిసార్లు పాయింట్లను కోల్పోవాల్సిన పరిస్థితి ప్రతి జట్టుకూ ఎదురవుతుంది. అయితే, ప్రత్యర్థిపై విజయం కోసం అలాంటివాటిని



పట్టించుకోవద్దని గౌతమ్ గంభీర్ తన టీముకు సందేశం ఇచ్చిన విషయంపై ప్రస్తుతం జోరుగా చర్చ జరుగుతోంది. ఇంగ్లాండ్‌తో ఐదో టెస్టు ఐదో రోజు ఐసీసీ నుంచి వచ్చిన వార్నింగ్‌పై గంభీర్ స్పందించిన తీరు అభిమానులను ఆకట్టుకుంది. ఓవల్ వేదికగా జరిగిన చివరి మ్యాచ్‌లో భారత్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఆఖరి రోజున టీమ్ ఇండియాకు 4 వికెట్లు అవసరం కాగా.. ఇంగ్లాండ్‌కు 35 పరుగులు మాత్రమే కావాలి. ఇలాంటి పరిస్థితుల్లో అప్పటికే భారత జట్టు 6 ఓవర్లు వెనకబడి ఉంది. దానిని కవర్ చేయడం లేదా ఇంగ్లాండ్‌ను త్వరగా ఆలౌట్ చేయడమే భారత జట్టు ముందున్న ప్రత్యామ్నాయాలు. లేకపోతే డబ్ల్యూటీసీలో పాయింట్లను కోల్పోయే ప్రమాదం ఉంది. భారత కోచింగ్ బృందంలోని ఓ సభ్యుడు మాత్రం స్పిన్నర్లతో కొన్ని ఓవర్లు వేయిస్తే బెటర్ అని సలహా ఇచ్చాడు. కానీ, స్లో ఓవర్ పెనాల్టీ కంటే విజయం ముఖ్యమనే ఉద్దేశంతో గంభీర్ 'పేసర్లతోనే బౌలింగ్ చేయిద్దాం' అని సూచించాడు. సిరాజ్, ప్రసిద్ధ అద్భుతంగా బంతులేసి జట్టును గెలిపించారు. వీరిద్దరూ గంటలోపే నాలుగు వికెట్లను పడగొట్టడం విశేషం.

# విరాట్ జెర్సీని పదిలంగా దాచుకున్న సిరాజ్



విరాట్ కోహ్లి, మహ్మద్ సిరాజ్ మధ్య ప్రత్యేక అనుబంధం ఉంది. కోహ్లి చివరిసారిగా ధరించిన టెస్ట్ జెర్సీని సిరాజ్‌కు కానుకగా ఇచ్చాడు. దాన్ని సిరాజ్ తన ఇంట్లో పదిలంగా దాచుకున్నాడు. విరాట్ కోహ్లి, మహ్మద్ సిరాజ్ మధ్య చాలా ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ఐపీఎల్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు విరాట్ కోహ్లి కెప్టెన్సీలో మహ్మద్ సిరాజ్ ఆడాడు. అతడిలోని ప్రతిభను గుర్తించిన కోహ్లి ప్రత్యేకంగా ప్రోత్సహించాడు. సిరాజ్‌ను వరల్డ్ క్లాస్ బౌలర్ తీర్చిదిద్దడంలో విరాట్ కోహ్లి పాత్ర కూడా ఉంది! ఈ నేపథ్యంలో వారి మధ్య స్నేహం చిగురించింది. అందుకే విరాట్ కోహ్లి టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత.. అతడు లేని డ్రెస్సింగ్ రూమ్ అసంపూర్ణంగా ఉందని సిరాజ్ పేర్కొన్నాడు. ప్రస్తుతం ఈ పేసర్ ఇంట్లో ఉన్న కోహ్లి జెర్సీ కేవలం ఓ జ్ఞాపకం మాత్రమే కాదు.. వారిద్దరి మధ్య ఉన్న అనుబంధానికి, స్నేహానికి గుర్తు అని క్రికెట్ అభిమానులు అంటున్నారు.

జస్ప్రీత్ బుమ్రా తర్వాత, సిరాజ్.. టీమ్ ఇండియాకు కీలక బౌలర్ మారాడు. తాజాగా ముగిసిన టెండూల్కర్-అండర్సన్ ట్రోఫీలోనూ అయిదు మ్యాచుల్లో 23 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అలాగే రెండు సార్లు అయిదు వికెట్ల ప్రదర్శన కూడా చేశాడు. ముఖ్యంగా ఈ ట్రోఫీలో భాగంగా ఓవల్ వేదికగా జరిగిన చివరి మ్యాచ్‌లో టీమ్ ఇండియా ఆరు పరుగుల తేడాతో గెలిచి, సిరీస్‌ను సమం చేయడంలో.. సిరాజ్ కీలకపాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో అతడు రెండు ఇన్నింగ్స్‌లో కలిపి తొమ్మిది వికెట్లు తీసుకున్నాడు. ఇప్పటి వరకు 41 టెస్ట్ మ్యాచ్‌లు ఆడిన సిరాజ్ 123 వికెట్లు పడగొట్టాడు. ఇంగ్లాండ్ టూర్‌లో టీమిండియా విజయం సాధించిన తర్వాత విరాట్ కోహ్లి.. సోషల్ మీడియా వేదికగా సిరాజ్, ప్రసిద్ధ కృష్ణను ప్రశంసించాడు. ముఖ్యంగా మహ్మద్ సిరాజ్ అద్భుతంగా రాణించి, టీమ్‌ఇండియా విజయంలో కీలకపాత్ర పోషించాడని కొనియాడాడు. దానికి సిరాజ్ కూడా స్పందిస్తూ.. విరాట్ కోహ్లికి కృతజ్ఞతలు తెలిపాడు.